ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com


నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -6 పేజీలు - 08 వెల - 04/- శుక్రవారం12 డిసెంబర్ 2025

# 506 ప్రాజెక్టులకు రూ.9,500 కోట్లు

## పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో సమగ్ర నీటి నిర్వహణ





- అమరావతిలో లోక్‌భవన్, అసెంబ్లీ దర్బార్ హాల్ నిర్మాణం
- గవర్నర్ కార్యాలయం, రెండు గెస్ట్ హౌస్‌లు, స్టాఫ్ క్వార్టర్లకు అనుమతి
- 44 అంశాలపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చ
- క్వాంటం కంప్యూటింగ్‌లో రూ.1421 కోట్ల పెట్టుబడులు
- 3057 మందికి క్వాంటం అప్లికేషన్స్‌లో శిక్షణ
- కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

అమరావతి, **డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి**
పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో సమగ్ర నీటి నిర్వహణకు సంబంధించి దాదాపు రూ.9,500 కోట్లతో 506 ప్రాజెక్టులకు పరిపాలన అనుమతులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతిలో లోక్‌భవన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ కార్యాలయం, రెండు గెస్ట్ హౌస్‌లు, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి మంత్రివర్గం అంగీకారం లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన మంత్రివర్గ సమావేశంలో 44 అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. సమావేశం ముగిసిన తర్వాత కేబినెట్ నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు.మిగతా 2లో...

# చంద్రబాబు పాలనపై మోదీ ప్రశంసలు..

## జగన్ విమర్శలను తిప్పికొట్టాలని ఆదేశం!

- ఏపీ, తెలంగాణ, అండమాన్ బీజేపీ ఎంపీలతో మోదీ భేటీ
- పెట్టుబడులు కూడా ఏపీ వైపు వెళుతుండటం హర్షణీయమని వెల్లడి
- తెలంగాణలో బీజేపీ ప్రతిపక్ష పాత్ర పోషించట్లేదని అసంతృప్తి
- తెలుగు ఎంపీలు జాతీయ అంశాలపై చురుగ్గా ఉండాలని దిశానిర్దేశం



2లో.

# ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ కాల్...

- ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ పరిణామాలపై చర్చ
- వాణిజ్యం, రక్షణ, సాంకేతిక రంగాల్లో సహకారంపై సమీక్ష
- త్వరలో భారత్‌లో పర్యటిస్తానని ఇటీవల వ్యాఖ్యానించిన ట్రంప్



2లో.

# పిన్నెల్లి సోదరులకు 14 రోజుల రిమాండ్

## జంట హత్యల కేసులో

## లొంగిపోయిన పిన్నెల్లి సోదరులు

- మాచర్ల కోర్టులో హాజరుకావడంతో 14 రోజుల రిమాండ్
- ముందస్తు బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన సుప్రీంకోర్టు



అమరావతి, **డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి**
జంట హత్యల కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డికి మాచర్ల కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వారిద్దరూ గురువారం మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట లొంగిపోయారు. విచారణ అనంతరం న్యాయమూర్తి వారికి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మిగతా 2లో...

# ఆందోళనకరంగా అమిత్ షా తీరు

## ఆయన భాష కూడా సరిగా లేదు -విపక్ష నేత రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ, **డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి**
ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభ సమావేశాల్లో జరిగిన చర్చ సందర్భంగా.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆందోళనకరంగా ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీవ్యాఖ్యానించారు. ఆయన భాష కూడా స్పష్టంగా లేదని..అమిత్ షా ప్రసంగాన్ని ఉద్దేశించి అన్నారు.'బుధవారం నాటి సమావేశంలో.. ఓటు చోరీ అంశంపై మీడియా ముందు నేను చేసిన వ్యాఖ్యలను పార్లమెంట్‌లో చర్చకు తీసుకురావాలనిమిగతా 2లో...

# తొలివిడతలో కాంగ్రెస్ హవా

## 90శాతం సర్పంచ్ స్థానాల్లో పాగా -అత్యధిక సీట్లు గెల్చుకున్న కాంగ్రెస్ మద్దతుదారులు


హైదరాబాద్, **డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి**
స్థానిక ఎన్నికల తొలి విడతలో కాంగ్రెస్ సత్తా చాటింది. అనేక గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. దాదాపు 90శాతం స్థానాల్లో విజయ ఢంకా ఎగురేశారు. తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు అద్భుతమైన విజయాన్ని నమోదు చేసి తమ హవాను చాటారు. మొత్తం 4,231 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ జరగ్గా, వెలువడుతున్న తొలి మిగతా 2లో...



# ఆల్ టైమ్ రికార్డ్...

## మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో దూసుకుపోతున్న ధాన్యం కొనుగోళ్లు

- డిసెంబర్ 10న ఏకంగా 1,46,607 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- డిసెంబర్ 11 నాటికి 20,64,673 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 15 రోజుల్లోనే ఎఫ్ సీఐ కి 1,71,651 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్డ్ రైస్ సరఫరా



అమరావతి, **డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం కొనుగోళ్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యవేక్షణలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025-26) సేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోంది.మిగతా 2లో...

# సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీలకు కలిసిన రేవంత్ రెడ్డి

- ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి
- గ్లోబల్ సమ్మిట్ విజయంపై వివరించిన రేవంత్
- రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పనితీరుపై అధిష్ఠానానికి వివరణ



న్యూఢిల్లీ, **డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో సమావేశమయ్యారు. ఈ ఉదయం పార్టీ ఎంపీలతో కలిసి ఆయన అధిష్ఠానంతో భేటీ అయ్యారుమిగతా 2లో...

# లోక్‌సభలో ఈ- సిగరెట్ దుమారం

## అనురాగ్ ఠాకూర్ ప్రస్తావన..స్పీకర్ ఆగ్రహం



న్యూఢిల్లీ, **డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి**
పార్లమెంట్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ఎంపీ.. సభా పరిసరాల్లోనే ఈ-సిగరేట్ తాగినట్లు బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు. లోక్‌సభలో ఆయన ఈ విషయాన్ని స్పీకర్ ఓం బిర్లా ముందు ప్రస్తావించారు. మిగతా 2లో...

# నేడు విశాఖలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పర్యటన...

- కాగ్నిజెంట్, సత్వా క్యాంపస్‌లకు భూమి పూజ
- విశాఖలో కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ భారీ పెట్టుబడులు
- రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న సీఎం, మంత్రి లోకేశ్
- మరో 7 ఐటీ క్యాంపస్ లకు కూడా భూమిపూజ చేయనున్న లోకేశ్
- రూ.3000 కోట్లకు పైగా పెట్టుబడులు, 33 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు
- ఐటీ హబ్‌గా విశాఖను తీర్చిదిద్దే దిశగా కీలక ముందడుగు



2లో.

# 506 ప్రాజెక్టులకు రూ.9,500 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

44 అంశాలపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపిందని మంత్రి పార్ధసారథి తెలిపారు. అమృత్ 2 లో భాగంగా 2026 మార్చి 31 కల్లా పెండింగ్ పనులు ప్రారంభించాలని కేంద్రం స్పష్టం చేసిందని.. అమృత్ 2లో భాగంగా 506 పెండింగ్ ప్రాజెక్టులను రూ.9,613 కోట్ల నిధులతో చేపట్టేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. రూ.163 కోట్లతో అమరావతిలో లోక్ భవన్ నిర్మాణానికి టెండర్లు పిలిచే ప్రతిపాదనలకు ఆమోదం లభించిందన్నారు. ఎల్ 1 బిడ్లను ఆమోదించే బాధ్యతను సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమరావతిలో ఇ 3 రోడ్డు విస్తరణకు ఎల్ 1 బిడ్ ఆమోదానికి అమరావతి డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఎండీకి బాధ్యతలు అప్పగించామన్నారు. సీడ్ యాక్సిస్ రహదారిని 16వ జాతీయ రహదారికి అనుసంధానించే పనులకు రూ.532కోట్ల మేర టెండర్లు పిలిచేందుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. కుప్పంలో పాలేరు నదిపై చెక్ డ్యాంల నిర్వహణకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ ముసాయిదా బిల్లుపై కేబినెట్‌లో చర్చించారు. ఎస్ఐపీబీలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రపెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో 26సంస్థల ఏర్పాటుకు సంబంధించి ఆమోదం తెలిపిన దాదాపు రూ.20,444 కోట్ల పెట్టుబడులకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. వీటి ద్వారా 56వేల పైచిలుకు ఉద్యోగాల కల్పన జరుగనుందని మంత్రి పార్ధసారథి తెలిపారు.చిత్తూరు జిల్లా కుప్పంలో పలార్ నదిపై చెక్ డ్యాం నిర్మాణానికి రూ.15.96 కోట్ల నిధులను పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించిందన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 417 టీచర్ పోస్టులను అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. సాంఘిక సంక్షేమ విభాగంలో సామాజిక సేవలో అనుభవం ఉన్న వ్యక్తులను చైర్మన్లు, మెంబర్లుగా నియమించే ప్రతిపాదనకు కేబినెట్ ఓకే చెప్పిందన్నారు. దేశంలో తొలి క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా కీలక ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్‌లో రూ.1421 కోట్ల రూపాయల పెట్టుబడులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. 3057 మందికి క్వాంటం అప్లికేషన్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చే
ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం చెప్పిందని అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ విభాగంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన 11 సంస్థల ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోద ముద్ర వేసిందని మంత్రి పార్ధసారథి తెలిపారు. క్వాంటం కంప్యూటర్లు తయారు చేయడం కోసం ముందుకు వచ్చిన పలు సంస్థల ప్రతిపాదనలకు, అలాగే క్వాంటం కంప్యూటింగ్ లో శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వచ్చిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. ఇటీవల ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న పలు పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 సంస్థలకు సంబంధించి 20267 కోట్ల రూపాయల పెట్టుబడులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంచడాన్ని సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. విద్యుత్ చార్జీలను రూ. 5.12 నుంచి 4 రూపాయలకు తీసుకురావాలన్నది సీఎం లక్ష్యమని చెప్పారు. దీని కోసం రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం పలు సంస్థల ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించిందన్నారు. కృష్ణపట్నం పోర్టులో 4731 ఎకరాలు మల్టీ ప్రాడక్ట్ సెజ్ ఏర్పాటు కోసం 2010లో ల్యాండ్ కొనుక్కున్నారని.. అక్టోబర్ 2019లో గత ప్రభుత్వం ఈ భూ కేటాయింపులను రద్దు చేసిందన్నారు. దీన్ని కోర్టు కొట్టి వేయడం వల్ల ప్రాజెక్టు పదేళ్లు ఆలస్యమైనందున పెనాల్టీని రద్దు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. 3 ఏళ్లలో తొలిదశ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభిం చాలని సమయం ఇస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మహిళల ప్రపంచ కప్ గెలుపులో విశేష ప్రతిభ చూపిన రాష్ట్ర క్రీడాకారిణి శ్రీ చరణికి ప్రోత్సాహకం ఇవ్వాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామన్నారు. శ్రీ చరణికి రూ.2.5 కోట్ల నగదు, విశాఖపట్నంలో 500 గజాలు ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయించినట్లు పార్ధసారథి చెప్పారు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక గ్రూప్ 1 ఉద్యోగం ఇచ్చే ప్రతిపాదనకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. పీఎం సూర్యఘర్ కింద ఇంటిపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకునే బీసీలకు అదనంగా సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కేంద్రం ఇచ్చే సబ్సిడీకి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల అదనపు సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం కలిన బీసీ వినియోగదారులకు రూ.20 వేల సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. రూ.5445 కోట్ల అంచనా బడ్జెట్‌తో పీఎం సూర్యఘర్ ప్రాజెక్టును రాష్ట్రంలో అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. ఞాష్ట్రంలో రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్ విషయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సీఎం తెలిపారన్నారు. ఏడాది కాలంలోనే రెవెన్యూ సమస్యలన్నింటినీ పూర్తిగా పరిష్కరించాలని రెవెన్యూ విభాగాన్ని సీఎం ఆదేశించారని తెలిపారు. 22 ఏ , మ్యుటేషన్, రీ సర్వే సమస్యలన్నింటినీ పూర్తిగా పరిష్కరించాలని.. ఆపై రెవెన్యూ రికార్డులన్నింటినీ బ్లాక్ చైన్ టెక్నాలజీ , క్లౌడ్‌లో సేవ్ చేయాలని సీఎం సూచించినట్లు తెలిపారు. తద్వారా రెవెన్యూ రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా శాశ్వత పరిష్కారం కల్పించాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి పార్ధసారథి పేర్కొన్నారు.

# ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ కాల్...

**ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ పరిణామాలపై చర్చ**

**వాణిజ్యం, రక్షణ, సాంకేతిక రంగాల్లో సహకారంపై సమీక్ష**

**త్వరలో భారత్‌లో పర్యటిస్తానని ఇటీవల వ్యాఖ్యానించిన ట్రంప్**

న్యూఢిల్లీ, **డిసెంబర్ 11, (రిపబ్లిక్ న్యూస్):** భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయనడానికి సూచికగా, ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య గురువారం టెలిఫోన్ సంభాషణ జరిగింది. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక సంబంధాల పురోగతితో పాటు పలు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించుకున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను కొనసాగించాల్సిన ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు.
ఈ సంభాషణ అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "అధ్యక్షుడు ట్రంప్‌తో చాలా ఆత్మీయంగా, ఫలవంతంగా సంభాషణ జరిగింది. ద్వైపాక్షిక సంబంధాల పురోగతిని సమీక్షించాం. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించాం. ప్రపంచ శాంతి, సుస్థిరత, శ్రేయస్సు కోసం భారత్, అమెరికా కలిసికట్టుగా పనిచేయడం కొనసాగిస్తాయి" అని పేర్కొన్నారు.
'భారత్–అమెరికా సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యం'లో పురోగతిని నేతలిద్దరూ సమీక్షించారు. అన్ని రంగాల్లో ద్వైపాక్షిక సహకారం నిలకడగా బలపడుతుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా 'ఇండియా%–%యూఎస్ కాంపాక్ట్' (%జూపీూూజు%) అమలులో భాగంగా కీలకమైన సాంకేతికతలు, ఇంధనం, రక్షణ, భద్రత వంటి ప్రాధాన్యతా రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడానికి, ఉమ్మడి ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి కలిసి పనిచేయాలని ఇరువురు నేతలు అంగీకరించారు.
ఇదిలా ఉండగా, గత నెలలో ట్రంప్ ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీని "గొప్ప వ్యక్తి", "నా స్నేహితుడు" అని అభివర్ణిస్తూ, త్వరలోనే భారత్‌లో పర్యటించాలనే యోచనలో ఉన్నట్లు తెలిపారు. నవంబర్ 6న వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "మోదీ నా స్నేహితుడు, మేం మాట్లాడుకుంటాం. నన్ను అక్కడికి రమ్మని కోరుతున్నారు. నేను వెళతాను" అని అన్నారు. 2020లో తన భారత పర్యటన అద్భుతంగా జరిగిందని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు.
భారత్‌తో వాణిజ్య చర్చలు చాలా సానుకూలంగా సాగుతున్నాయని ట్రంప్ వెల్లడించారు. ఈ వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ, వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ కూడా ఇటీవల కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ పట్ల ట్రంప్‌కు గొప్ప గౌరవం ఉందని, ఇరువురు నేతలు తరచుగా మాట్లాడుకుంటారని ఆమె తెలిపారు. వాణిజ్య అంశంపై భారత ప్రతినిధులతో తమ బృందం ఉన్నతస్థాయిలో చర్చలు జరుపుతోందని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా జరిగిన ఫోన్ సంభాషణ రెండు దేశాల మధ్య వ్యూహాత్మక బంధాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.

# నేడు విశాఖలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పర్యటన...

**కాగ్నిజెంట్, సత్వా క్యాంపస్‌లకు భూమి పూజ**

అమరావతి **డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత విశాఖపట్నం ఐటీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. నగరాభివృద్ధిలో కీలక మైలురాళ్లుగా నిలిచే రెండు భారీ ప్రాజెక్టులకు రేపు (డిసెంబరు 12) శ్రీకారం చుట్టనున్నారు. అంతర్జాతీయ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్‌తో పాటు, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ తమ క్యాంపస్‌ల నిర్మాణానికి భూమి పూజ చేయనున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా విశాఖలో రూ.3,000 కోట్లకు పైగా పెట్టుబడులు రానుండగా, ప్రత్యక్షంగా 33 వేలకు పైగా ఉద్యోగాలు లభించనున్నాయి.
విశాఖ కాపులుప్పాడ ఐటీ హిల్స్‌లో 21.31 ఎకరాల్లో నిర్మించనున్న కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేస్తారు. ఈ సంస్థ రూ.1,583 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో ఈ క్యాంపస్‌ను నిర్మించనుంది. దీని ద్వారా 8 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2033 నాటికి నిర్మాణం పూర్తి కానుండగా, మొదటి దశను 2029 నాటికి పూర్తి చేసి 3 వేల మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో, రుషికొండలోని మహతి ఫిన్ టెక్ భవనంలో వెయ్యి సీటింగ్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయాన్ని ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రారంభిస్తారు. ఈ కేంద్రం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలపై దృష్టి సారిస్తుంది.
మరోవైపు, దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ విశాఖ మధురవాడలోని హిల్–4లో నిర్మించనున్న 'సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్'కు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. రూ.1,500 కోట్ల పెట్టుబడితో 30 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. దీని ద్వారా ప్రత్యక్షంగా 25 వేల మందికి, పరోక్షంగా 40 వేల నుంచి 50 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఈ క్యాంపస్‌లో కేవలం ఐటీ కార్యాలయాలే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో నివాసాలు, రిటైల్, హాస్పిటాలిటీ సదుపాయాలను కూడా ఏర్పాటు చేయనున్నారు.
బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో భారీ ప్రాజెక్టులు నిర్మించిన సత్వా గ్రూప్, విశాఖలో రాబోయే ఐదేళ్లలో 4 మిలియన్ చదరపు అడుగుల ఐటీ ఆఫీస్ స్పేస్‌ను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగ్నిజెంట్, సత్వా గ్రూప్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల రాకతో విశాఖపట్నం త్వరలోనే గ్లోబల్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా మారనుందనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# తొలివిడతలో కాంగ్రెస్ హవా

(మొదటి పేజీ తరువాయి)
ఫలితాల్లో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఇదిలా ఉండగా.. గురువారం సాయంత్రం సమయానికి వెలువడిన ఫలితాలు ఇలా ఉన్నాయి... కాంగ్రెస్: 1733, బీఆర్ఎస్ 721, బీజేపీ 133 ఇతరులు 311 స్థానాల్లో గెలుపొందారు.90 శాతం స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్ నాయకులు దీనిని ప్రజాపాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదంగా అభివర్ణించారు. పంచాయతీ ఎన్నికలలో భాగంగా తొలి విడత పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. తొలి విడతలో 3,834 సర్పంచ్, 27,628 వార్డ్ మెంబర్ స్థానాలకు పోలింగ్ జరిగింది. సాధారణ ఎన్నికలతో పోల్చితే సర్పంచ్ ఎన్నికల్లో ఓటర్ల నుంచి భారీ స్పందన వచ్చింది. ఒక్కో జిల్లాల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ జరిగిన స్థానాలతో పాటు, ఎన్నికలు ఏకగ్రీవమైన ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులదే పైచేయిగా ఉంది. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఏకగ్రీవమైన 45 సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ ఏకంగా 32 స్థానాలను దక్కించుకుంది. నల్గొండ జిల్లాలో 17, సూర్యాపేట జిల్లాలో 5, యాదాద్రి జిల్లాలో 10 ఏకగ్రీవ స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు విజయ ఢంకా మోగించారు. మొదటి విడతలో 3,834 గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరగ్గా, కౌంటింగ్ పక్రియ మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైంది. బ్యాలెట్ పత్రాల లెక్కింపు మ్యాన్యువల్‌గా జరుగుతున్నందున, మేజర్ గ్రామ పంచాయతీల్లో ఫలితాలు వెల్లడికావడానికి కొంత ఆలస్యం అవుతోంది. ఎంత ఆలస్యమైనా ఈరోజే ఉప సర్పంచ్ ఎన్నికను కూడా పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఈ ఎన్నికల్లో దాదాపు 79.15శాతం పోలింగ్ నమోదైంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవాలు నిర్వహించకుండా పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ దాదాపు ప్రశాంతంగా ముగిసింది.. క్యూ లైన్ లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు అధికారులు.. పోలింగ్ కేంద్రం ఆవరణలో మధ్యాహ్నం 1 గంటలోపు ఉన్న వారికి టోకెన్లు జారీ చేసి ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పించారు. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్ బ్యాక్స్ లను సీల్ చేశారు.. మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ పక్రియ ప్రారంభం అయ్యింది. మొదట పోస్టల్ బ్యాలెట్స్ లెక్కింపు చేపట్టారు.. సర్పంచ్, వార్డు మెంబర్ల బ్యాలెట్ పత్రాలు వేరు చేసి, కట్టలు కట్టే పక్రియ కొనసాగించారు.. అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 87.93 శాతం పోలింగ్. మెదక్ జిల్లాలో 86 శాతం పోలింగ్ నమోదు. వరంగల్ జిల్లాలో 81.2 శాతం పోలింగ్ నమోదు. ములుగు జిల్లాలో 73.57 శాతం, హన్మకొండలో 75.6 శాతం, జనగాంలో 71.96 శాతం పోలింగ్ నమోదు. సూర్యాపేట జిల్లాలో 87.77 శాతం పోలింగ్ నమోదు. నల్గొండ జిల్లాలో 81.63 శాతం పోలింగ్ నమోదు. నిర్మల్ జిల్లాలో 79.81 శాతం పోలింగ్ నమోదు. ఆదిలాబాద్‌లో 69.10 శాతం పోలింగ్ నమోదు అయ్యింది.

# ఆందోళనకరంగా అమిత్ షా తీరు

(మొదటి పేజీ తరువాయి)
అమిత్ షాకు సవాల్ విసిరాను. ఆ సమయంలో ఆయన ఆందోళనకరంగా కనిపించారు. భాష కూడా సరిగ్గా లేదు. చేతులు వణుకుతూ కనిపించాయి. ఏ ప్రశ్నకూ నేరుగా సమాధానం చెప్పలేకపోయారు. ఎలాంటి ఆధారాలూ చూపడం లేదు. మానసికంగా ఒత్తిడికి లోనయ్యారు. మీరూ ఆ విషయాన్ని గమనించే ఉంటారు' అని అమిత్ షానుద్దేశించి రాహుల్ అన్నారు.
అయితే.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ వర్గాలు స్పందిస్తూ.. నిన్న చర్చలు జరిగే సమయానికి అమిత్ షా అనారోగ్యానికి గురయ్యారని తెలిపాయి. లోక్ సభలో ప్రసంగించేందుకు లేచి నిల్చున్నప్పుడు ఆయన 102 డిగ్రీల జ్వరంతో ఇబ్బంది పడ్డారని చెప్పాయి. సమావేశం ప్రారంభానికి ముందే ఆయన్ను వైద్యులు పరీక్షించి మందులు ఇచ్చారని పేర్కొన్నాయి. కాగా, ఈ చర్చ సందర్భంగా.. అమిత్ షా సుమారు 90 నిమిషాల పాటు మాట్లాడారు. ఓటు చోరీ అంశంపై రాహుల్ చేస్తున్న ఆరోపణల్ని కొట్టిపారేశారాయన. కాంగ్రెస్ పార్టీయే ఓటు చోరీకి పాల్పడిందని, నాయకత్వ లోపమే ఆ పార్టీ ఎన్నికల్లో పరాజయం చెందడానికి కారణమని షా విమర్శించారు.

# ఆల్ టైమ్ రికార్డ్...

(మొదటి పేజీ తరువాయి)
కేవలం ఒక్కరోజే, అంటే డిసెంబర్ 10న, ఏకంగా 1,46,607 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి పౌరసరఫరాల శాఖ ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది.డిసెంబర్ 11 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 3,24,296 మంది రైతుల నుంచి మొత్తం 20,64,673 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందుకు గాను రైతులకు ఇప్పటివరకు రూ.4,609.89 కోట్లను చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రారంభమైన కేవలం 15 రోజుల్లోనే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కు 1,71,651 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్డ్ రైస్ బియ్యాన్ని పంపడం ఒక చారిత్రక రికార్డుగా పౌరసరఫరాల శాఖ పేర్కొంది.ఇటీవల కురిసిన వర్షాలు, దిత్వా తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. ముఖ్యంగా కృష్ణా జిల్లాలోని 106 రైస్ మిల్లులకు ఇతర జిల్లాల నుంచి ధాన్యం తరలించేందుకు ప్రత్యేక అనుమతులు జారీ చేసింది. కొనుగోలు, రవాణా ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 32,000 లారీలు, ట్రాక్టర్లు, ప్రత్యేక రైళ్లను వినియోగిస్తున్నారు.రైతులకు అండగా నిలవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పారదర్శక విధానాలతో కొనుగోళ్లు జరుపుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మిల్లర్లపై కఠిన నిఘా ఉంచి, రోజువారీ సమీక్షలతో ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని, రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా చూస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# చంద్రబాబు పాలనపై మోదీ ప్రశంసలు..

**ఏపీ, తెలంగాణ, అండమాన్ బీజేపీ ఎంపీలతో మోదీ భేటీ**

న్యూఢిల్లీ, **డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి** ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం శుభపరిణామమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో పరిపాలనపై తనకు మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చిందని, పెట్టుబడులు కూడా ఏపీ వైపు వెళుతుండటం హర్షణీయమని, అది అభివృద్ధికి సూచిక అని ప్రశంసించారు. ఈరోజు ఢిల్లీలో ఏపీ, తెలంగాణ, అండమాన్ రాష్ట్రాలకు చెందిన బీజేపీ ఎంపీలతో ప్రధాని అల్పాహార విందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు అరగంట పాటు ఆయన ఎంపీలతో మాట్లాడారు.
ఈ సమావేశంలో ఏపీ బీజేపీ ఎంపీలకు మోదీ కీలక సూచన చేశారు. వైసీపీ అధినేత జగన్, ఆయన పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలను బీజేపీ కూడా అంతే దీటుగా తిప్పికొట్టాలని ప్రధాని ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ఏపీలో సానుకూల వాతావరణం ఉందని, దానిని కాపాడుకోవాలని సూచించారు.
అదే సమయంలో, తెలంగాణ బీజేపీ ఎంపీల పనితీరుపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో పార్టీ ప్రతిపక్ష పాత్రను కూడా సమర్థంగా పోషించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "మంచి టీమ్‌ని ఏర్పాటు చేసుకుని ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి సమస్యేంటి? పార్టీ గ్రాఫ్ పెంచుకోవడానికి మంచి అవకాశం ఉన్నా ఎందుకు విఫలమవుతున్నారు?" అని ఆయన ప్రశ్నించినట్లు తెలిసింది. తెలుగు రాష్ట్రాల ఎంపీలు జాతీయ అంశాలపై చురుగ్గా స్పందించాలని, దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకోవాలని మోదీ సూచించారు.


# పిన్నెల్లి సోదరులకు 14 రోజుల రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)
నిందితులను నెల్లూరు జిల్లా జైలుకు తరలించనున్నారు.ఈ ఏడాది మే 24న మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో టీడీపీ నేతలు జవ్విశెట్టి వెంకటేశ్వరరావు, జవ్విశెట్టి కోటేశ్వరరావు హత్యకు గురయ్యారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో పోలీసులు పిన్నెల్లి సోదరులను ఏ6, ఏ7 నిందితులుగా చేర్చారు.అరెస్టు నుంచి తప్పించుకునేందుకు పిన్నెల్లి సోదరులు తొలుత హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నించగా పిటిషన్ తిరస్కరణకు గురైంది. దీంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా వారికి చుక్కెదురైంది. వారి పిటిషన్‌ను కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం, రెండు వారాల్లోగా సంబంధిత కోర్టులో లొంగిపోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువు ముగుస్తుండటంతో వారు గురువారం మాచర్ల కోర్టులో లొంగిపోయారు.

# సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీలకు కలిసిన రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)
. ఈ సందర్భంగా తెలంగాణలోని తాజా రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు వంటి కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం.
రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను, ప్రభుత్వ పాలన తీరును రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పెద్దలకు వివరించారు. ముఖ్యంగా, ఇటీవల హైదరాబాద్ వేదికగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ఘన విజయం సాధించిన విషయాన్ని సోనియా గాంధీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.ఈ నెల 8, 9 తేదీల్లో జరిగిన ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తరలివచ్చాయని ఆయన తెలిపారు. కేవలం రెండు రోజుల్లోనే వివిధ రంగాల్లో కలిపి రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగామని రేవంత్ రెడ్డి అధిష్ఠానానికి వివరించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర అభివృద్ధికి ఈ పెట్టుబడులు ఎలా దోహదపడతాయో ఆయన వివరించినట్లు తెలుస్తోంది.


# లోక్‌సభలో ఈ- సిగరెట్ దుమారం




అయితే ఆ ఈ–సిగరేట్ తాగిన వ్యక్తిపై చర్యలు తీసుకోనున్నట్లు స్పీకర్ బిర్లా పేర్కొన్నారు. ఇలా ఎవరు చేసినా సహించేది లేదన్నారు. ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రశ్నోత్తరాల సమయంలో సప్లిమెంటరీ అడిగిన సమయంలో బీజేపీ ఎంపీ ఆ విషయాన్ని గుర్తు చేశారు. సభలో ఈ–సిగరెట్లకు అనుమతి ఉందా అని ఎంపీ అనురాగ్.. స్పీకర్ బిర్లాను అడిగారు. లేదు అని ఆయన సమాధానం ఇచ్చారు. అయితే గత కొన్ని రోజుల నుంచి టీఎంసీ ఎంపీ సభలో ఈ–సిగరేట్ తాగుతున్నట్లు ఎంపీ ఠాకూర్ ఆరోపించారు. ఆ ప్రతిపక్ష ఎంపీపై చర్యలు తీసుకోవాలని అనేకమంది బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. భారీగా నినాదాలు రావడంతో.. సభ్యుల్ని స్పీకర్ బిర్లా శాంతపరిచారు. హుందాగా వ్యవహరించాలన్నారు.ఒకవేళ ఏదైనా లిఖితపూర్వక ఫిర్యాదు నమోదు చేస్తే, అప్పుడు ఆ ఎంపీపై చర్యలు తీసుకుంటానన్నారు. కొన్నేళ్ల క్రితమే ఇండియాలో ఈ–సిగరేట్లను నిషేధించారు. అయితే సోషల్ మీడియా పుకార్ల ప్రకారం.. టీఎంసీ ఎంపి మహువా మైత్రి.. పార్లమెంట్‌లో ఈ–సిగరేట్లు తాగుతున్నట్లు తెలిసింది.

# ఇద్దరి పై కర్నూలు జిల్లా బహిష్కరణ ఉత్తర్వుల జారి.

## కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, ఐఏఎస్ -కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్.






**ఆంధ్ర ప్రగతి కర్నూలు క్రైమ్ డిసెంబర్ 11:**
కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో షరీన్ నగర్ నందు నివాసముండే కిరాయి హంతకుడు షీట్ నెంబర్ వన్ అయిన వడ్డే రామాంజనేయులు ఏ వడ్డే అంజి మరియు సస్పెక్ట్ షీటర్ 216 అయిన పఠాన్ ఇమ్రాన్ ఖాన్ అనే ఈ ఇద్దరు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అలవాటు పడిన వీరి ఇద్దరి పై కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, ఐఏఎస్ జిల్లా బహిష్కరణ ఉత్తర్వులను జారీ చేయడం జరిగింది. కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు వడ్డే రామాంజినేయులు ఏ వడ్డే అంజి మీద జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ లలో 17 కు పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి. అందులో హత్యలు, దోపిడీలు, ఎస్సీ ఎస్టీ వర్గాల మీద దాడులు, జులుం కేసులు, హత్యాయత్నం కేసులు ఇలా పలు రకాల కేసులు నమోదయి ఉన్నాయి. అదే విధంగా మరొక వ్యక్తి అయిన పఠాన్ ఇమ్రాన్ ఖాన్ మీద కూడా సుమారు 19 క్రిమినల్ కేసుల్లో నిందితుడు గా ఉన్నాడు. పలుమార్లు వీరి పై తెలిపిన కేసుల్లో రిమాండ్కు వెళ్లినా కూడా వారిలో ఎటువంటి మార్పు రాకపోవడం, మరియు అదేవిధంగా 2022 వ సంవత్సరంలో వీరిద్దరూ కూడా పిడి యాక్ట్ నిర్బంధ ఉత్తర్వుల కింద కడప సెంట్రల్ జైల్లో ఖైదు చేయబడినప్పటికీ వీరి ప్రవర్తనలో మార్పు రాకపోగా, తదుపరి కూడా రకరకాల కేసులలో పాల్గొంటున్నారని కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ యొక్క ప్రతిపాదనల మేరకు వారి ఇద్దరి యొక్క క్రిమినల్ రికార్డ్ లను నిశితంగా పరిశీలించిన మీదట జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఐఏఎస్ నిన్నటి రోజున ఇద్దరి మీద జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మాట్లాడుతూ...జిల్లాలో ఇప్పటినుండి ఎవరైనా రౌడీయిజంతో అరాచక శక్తులుగా మారి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగజేసే విధంగా ప్రవర్తిస్తే అటువంటి వారిపై జిల్లా బహిష్కరణతో పాటు గా పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు తరలించడం జరుగుతుందని, ప్రశాంతంగా, మంచిగా, బుద్ధిగా జీవించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఇటువంటి చెడు నడత కలిగిన వారి పై మరియు ఇంకా కొంత మంది పై కూడా జిల్లా బహిష్కరణ గురించి పరిశీలనలో ఉన్నాయని కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు.

# రైల్వే కూలీలకు సామాజిక భద్రత ఇవ్వండి.

## రైల్వే కూలీల సమస్యలు పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 11:**
భారతదేశ వ్యాప్తంగా రైల్వే స్టేషన్లలో పనిచేసే కూలీల సమస్యలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని గురువారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లారు.లోక్ సభలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ పోర్టర్ల జీవనోపాధిని కాపాడాలని, దేశంలోని అన్ని రైల్వే స్టేషన్లలలో పోర్టర్ జీవనోపాధి (కూలీలు )అని కూడా పిలుస్తారని, ఈ రైల్వే కూలీలు దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లలో పనిచేస్తున్నారని అన్నారు. బ్యాటరీతో నడిచే వాహనాలు, బస్సు సేవలను కూడా అవుట్ సోర్స్ చేస్తున్నామని దీంతో రైల్వే కూలీల(పోర్టర్) ఆదాయం పడిపోయిందని, కూలీల ఆదాయం కూడా తగ్గడంతో రైల్వే కూలీల కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి వెళ్ళాయని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పార్లమెంట్ దృష్టికి తెచ్చారు. రైల్వే బోర్డు 2008లో ఇలాంటి సంక్షోభాన్ని పరిష్కరించిందని, ఇక్కడ ఒక ప్రత్యేక విధానాన్ని రూపొందించారని, ఈ పోర్టర్లను రైల్వేలలో ఉంచారు. కాబట్టి నేను అభ్యర్థిస్తున్నాను. రైల్వే కూలీలకు రక్షణ, క్రమబద్ధీకరణ చేయాలని, ఆధునీకరణ యుగంలో బలహీనమైన శ్రామిక శక్తికి సామాజిక భద్రతను అందించడానికి ఒక సమగ్ర పథకాన్ని ప్రవేశపెట్టాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్టవ్ ను కోరారు.

# సాగుదారులకు రెవిన్యూ రికార్డులో హక్కులు కల్పించాలి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ డిసెంబర్ 11:**
నంద్యాల మండలం భీమవరం గ్రామంలో లబ్ధిదారులకు ఇచ్చిన అసైన్డ్ ల్యాండ్ నిజమైన లబ్ధిదారుల భూమిని ప్రభుత్వం తన అవసరానికి తీసుకొని మరోచోట భూమి ఇస్తామని చెప్పిన వాటిని అమలు చేయలేదని కచ్చితంగా అమలు చేయాలని ఏపీ డి ఎస్ వ్యవస్థాపకులు, కొమ్మపాలెం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఫ్రేమ్ మరియు లబ్ధిదారులతో రూరల్ ఎమ్మార్వోను కలిసి మెమోరాండం ఇచ్చారు .మరియు గత 30 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నా సాగుదారులకు రెవిన్యూ రికార్డులు హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు . పేదలు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు గత 30 సంవత్సరాలు సాగు చేసుకుంటున్న భూములను వారికి హక్కు కనిపించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. భూ సర్వే సమయంలో కొందరికి తెలియకపోవడం ,ఆ సమయంలో ఊర్లో లేకపోవడం, కొందరు విషయాలు జరిగిందని, వారు వివరాలను సేకరించి సర్వేలో వాళ్ళ పేర్లను చేర్చాలని కోరారు.


# జూపాడుబంగ్లా మరియు పాములపాడు పోలీసు స్టేషన్ ల ఆకస్మిక తనిఖీ.

**హైవేలో రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి.**

**గ్రామాలలో సి సికేమరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించండి.**

**జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ డిసెంబర్ 11:**
ఆత్మకూరు సబ్ డివిజన్ పరిదిలోని జూపాడుబంగ్లా మరియు పాములపాడు పోలీసు స్టేషన్ లను నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు మరియు స్టేషన్ లోని రిషప్షన్ రూమ్, స్టోర్ రూమ్ ,లాకప్ గదులు,రికార్డు రూమ్ మొదలగునవి పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాకోవాలని ఆదేశించారు.అనంతరం పలు రికార్డులు ,పెండింగ్ కేసుల వివరాలపై ఆరాతీశారు.పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికతో విని చట్టపరిదిలో వాటిని పరిష్కరించాలి. అత్యవసర సంఘటనలపై త్వరితగతిన స్పందించి బాదితులకు న్యాయం చేసి ప్రజలలో పోలీసు ప్రతిష్ట పెంచేలా విధులు నిర్వర్తించాలి. పోలీసు స్టేషన్ పరిదిలోని గ్రామాలలో ప్రజా సంబంధాలు మెరుగుపరుచుకొనుట మరియు ఎలాంటి అల్లర్లు,గొడవలు జరుగకుండా ప్రత్యక శ్రేద్ధ ఉంచడంతో పాటు వారి సమస్యలు తెలుసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు.నేర నియంత్రణలో సి సి కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వాటిని అమలు చెయ్యాలి.హైవేలలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో ప్రమాద సూచికలు(సిగ్నల్స్ )ఏర్పాటు చెయ్యాలి. మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి. సైబర్ క్రైమ్,బాల్యవివాహాలు, చిన్నారులపై జరిగే నేరాలు మొదలగు వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి ఫిర్యాదిదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి,క్షుణ్ణంగా విచారించి నిర్దిష్ట సమయంలో చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్ నందు 112 టోల్ ఫ్రీ నంబర్ కు ఉపయోగించే ట్యాబ్ లు,వాటిని సిబ్బంది ఉపయోగిస్తున్న పనితీరుపై ఆరా తీసి, బీట్ డ్యూటీలలో పోలీసులు తప్పనిసరిగా ఉపయోగించాలని పలు సూచనలు చేయడం జరిగింది.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ పాల్గొన్నారు.

# శ్రీశైలం అభివృద్ధికి టీటీడీ పూర్తి సహకారం.

## -టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు.



**ఆంధ్ర ప్రగతి శ్రీశైలం డిసెంబర్ 11:**
శ్రీశైలం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు హామీ ఇచ్చారు.
హైదరాబాదులో టీవీ5 ప్రధాన కార్యాలయంలో గురువారం శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యులు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు గారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.
ఈ సందర్భంగా టీటీడీ దేవస్థానం తరహాలో శ్రీశైలం దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు సంపూర్ణ సహకారం అందించాలని బోర్డు పాలకమండలి బీఆర్ నాయుడును కోరారు.
టీటీడీ ఆధ్వర్యంలో శ్రీశైలంలో అన్ని హంగులతో కాటేజులు నిర్మాణం చేపట్టాలని, శ్రీశైలం దేవస్థాన ప్రాంత అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని వారు కోరారు%ా% శ్రీశైలం దేవస్థానాన్ని సందర్శించి తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని వారు ఆయనకు విజ్ఞప్తి చేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని, త్వరలో శ్రీశైలం వస్తానని బీఆర్ నాయుడు తెలిపారని శ్రీశైలం దేవస్థానం బోర్డు ఛైర్మన్ రమేష్ నాయుడు, మహానాడు మీడియా అధినేత, బోర్డు సభ్యులు బోడేపూడి వెంకటసుబ్బారావు మీడియాకు వెల్లడించారు.
ఈ కార్యక్రమం లో పాలకమండలి సభ్యులు ఏవి రమణ,ఆలా అనిల్ కుమార్, శంకరశెట్టి పిచ్చయ్య, మురళీధర్, కోడె క్రాంతి వర్ధిని, శ్రీదేవితోపాటు ప్రత్యేక ఆహ్వానిత సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జిల్లాలోని వివిధ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ డిసెంబర్ 11:**
నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ గురువారం నాడు ఆత్మకూరు సబ్ డివిజన్ నందికొట్కూరు రూరల్ సర్కిల్ పరిధిలోని మిడ్తూరు, బ్రాహ్మణకోట్కూరు మరియు నందికొట్కూరు టౌన్ పోలీసు స్టేషన్ లను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, కేసు రికార్డులు, ప్రజా సంబంధాలు, సిబ్బంది విధి నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు ,లాకప్ గదులు పరిశీలించి పరిశుభ్రంగా ఆదేశించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదిదారులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశిస్తూ పోలీసుల పనితీరుపై అరా తీశారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో విని, ముఖ్యంగా వృద్ధులు, నిరుపేదలు, మహిళలు వంటి బలహీన వర్గాల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకుని త్వరగా విచారించి పరిష్కరించాలని,ముఖ్యంగా గ్రేవ్ మరియు ప్రాపర్టీ కేసులు ఛేదించడం దర్యాప్తు వేగవంతం చేయాలని సూచిస్తూ వివిద రికార్డులను పరిశీలించారు.స్టేషన్ రికార్డులు,%జజుచీూ% లో రోజువారీగా పూర్తి చేయాలని ఆదేశించారు. అత్యవసర సంఘటనలపై త్వరితగతిన స్పందించేలా ఎస్హెచ్ఓ లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ లో బాగంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని మరియు మోటారు వాహన చట్టాన్ని అమలుచేయాలని డ్రంకెన్ డ్రైవ్, ఒపెన్ డ్రింకింగ్ లపై ప్రత్యేక దృష్టి ఉంచి తనిఖీలు చేపట్టాలన్నారు. నేర నియంత్రణ, చట్ట వ్యతిరేకమైన వాటి అక్రమ రవాణా వంటి కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణతో పాటు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు, చెడునడత వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు.శాంతిభద్రతల పరిరక్షణ మరియు మహిళలు చిన్నపిల్లల భద్రతపై ప్రత్యేక ప్రణాళికతో ఎలాంటి పక్షపాతం లేకుండా నేర నియంత్రణ నిక్కచ్చిగా అమలుచేయడం జరుగుతుందన్నారు.
స్టేషన్ నందు 112 టోల్ ఫ్రీ నంబర్ కు ఉపయోగించే ట్యాబ్ లు,వాటిని సిబ్బంది ఉపయోగిస్తున్న పనితీరుపై ఆరా తీసి, బీట్ డ్యూటీలలో పోలీసులు తప్పనిసరిగా ఉపయోగించాలని పలు సూచనలు చేయడం జరిగింది.

# సమస్యలు పరిష్కరించడానికి మేమున్నాము-తాసిల్దార్ రమాదేవి.




**ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 11:** ప్రజా వేదిక ద్వారా ప్రతి సోమవారం వచ్చే ప్రజల యొక్క సమస్యలను పరిష్కరించడానికి మేమున్నామని మహానంది మండల తహసిల్దార్ రమాదేవి పేర్కొన్నారు. మహానంది తాసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా వేదికలో భాగంగా వచ్చే దరఖాస్తులను ప్రజల నుండి ముఖ్యంగా రెవెన్యూ విభాగంలోని భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని తాహసిల్దార్ రమాదేవి తెలిపారు. మండల కేంద్రంలో కాకుండా జిల్లా కేంద్రానికి వ్యయ ప్రయాసలకు ఓర్చి తమ సమస్యల పరిష్కారం కొరకు ప్రజలు వెళ్తున్నారని అలా వెళ్లడంవల్ల సమయం వృధా అవ్వడంతో పాటు ఖర్చులు కూడా పెరిగిపోతూ ఉంటాయని వీటన్నింటిని గమనించి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో సమస్యల పరిష్కారం కొరకు దరఖాస్తు చేసుకుంటే త్వరగా సమస్యలు పరిష్కారం అవుతాయని, సమయం ఆదా అవుతుంది అని తహసిల్దార్ పేర్కొన్నారు. ఇక్కడ పరిష్కారం కానీ వాటికి సంబంధించి ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక సమర్పించి పరిష్కారం మార్గం సుగమం అయ్యేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిని గమనించి ప్రజలు ముఖ్యంగా మండల తాహసిల్ కార్యాలయంలో సమస్యల పరిష్కారం కొరకు ప్రతి సోమవారం జరిగే ప్రజా వేదికను ఉపయోగించుకోవాలని మహానంది మండల తహసిల్దార్ రమాదేవి మండల ప్రజలను కోరారు.

# పీఎం విశ్వకర్మ యోజనపై అవగాహన.

## -నంద్యాలలో ఎం.ఎస్.ఎం.ఈ ఆధ్వర్యంలో ఒకరోజు సదస్సు.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 11:**
నంద్యాల ఇండస్ట్రీస్ ఆఫీస్‌లో ఎం.ఎస్.ఎం.ఈ వారి ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ యోజనపై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎం విశ్వకర్మ యోజన ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్రోగ్రాం యొక్క ప్రయోజనాలను మరింతగా వివరించేందుకు, వారిని ప్రోత్సహించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ యోజన శిక్షణను పూర్తిచేసుకున్న అనేక మంది అభ్యర్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.ఎస్.ఎం.ఈ అసిస్టెంట్ డైరెక్టర్ వీరయ్య, పీఎం విశ్వకర్మ యోజన యొక్క ముఖ్య లక్ష్యాలు, లభ్యమయ్యే ప్రయోజనాలు, శిక్షణ పొందిన వారికి అందించే కిట్లు మరియు రుణ సౌకర్యాల గురించి వివరించారు.
శ్రీ వీరయ్య గారు మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ యోజన కింద కళాకారులు, పరంపర ఇతర వృత్తులలో నిపుణులు, టెక్నికల్ నైపుణ్యం కలిగిన వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక శిక్షణ, టూల్ కిట్ మరియు తక్కువ వడ్డీ రుణ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఈ అవకాశాలను పూర్తిగా వినియోగించుకొని స్వయం ఉపాధిని అభివృద్ధి చేసుకోవాలి” అని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నిపుణులు అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా శిక్షణ అనంతరం లభించే రుణ సౌకర్యాల వినియోగం, మార్కెట్ అవకాశాలు, వ్యాపార విస్తరణ, ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచే మార్గాలు వంటి అంశాలపై చర్చించారు.
ఈ సదస్సులో ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ శ్రీ మహబూబ్ బాషా, సి.ఎం.ఎం. శ్రీ భాస్కర్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ అధికారి ఎం.ఎన్.వి. రాజు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, సక్సెస్ఫుల్ పారిశ్రామికవేత్త శ్రీ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.అభ్యర్థులను ఉత్సాహపరిచేలా, వారి ప్రతిభను గుర్తించేలా ఈ అవగాహన సదస్సు ఉపయోగపడిందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆప్కాఫ్ చైర్మన్ గా బియస్ నవీన్ కుమార్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా డిసెంబర్ 11:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి దిశలో కీలకమైన నిర్ణయాలను వేగవంతంగా అమలు చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం మరో ముఖ్యమైన అధికారిక ఉత్తర్వును విడుదల చేసింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు మేరకు, ఉమ్మడి కర్నూలు జిల్లా కు చెందిన ఉన్నత విద్యావంతుడు అయినటువంటి బి.ఎస్. నవీన్ కుమార్ ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆప్కాఫ్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకంతో రాష్ట్రంలో ఆప్కాఫ్ పరిపాలన, మత్స్య సహకార సంఘాల అభివృద్ధి, మరియు సంబంధిత రంగాలలో పారదర్శకతను పెంపొందించే చర్యలు మరింత వేగం పొందనున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన నవీన్ కుమార్ నియామకం, జిల్లా మత్స్యకార వర్గాలకు, సహకార సంఘాలకు మరియు మొత్తం ఆప్కాఫ్ వ్యవస్థకు మరింత బలాన్ని అందించే నిర్ణయంగా భావించబడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఆప్కాఫ్ అభివృద్ధి పునర్నిర్మాణ పరుచుటలో ఇది కీలక మలుపు కానుందని స్పష్టం చేసింది.

# విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి.

### జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి మహానంది డిసెంబర్ 11:** వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టడీ అవర్స్ ను పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ.. డీ గ్రేడ్ పిల్లలను ప్రత్యేకమైన దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేసే విద్యార్థుల ప్రగతి అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. వంద శాతం ఫలితాల సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి విద్యార్థి కూడా ప్రతిరోజు ఉదయం 8 గంటల 40 నిమిషాలకు పాఠశాలకు హాజరు అవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన యూనిఫామ్, బూట్లు పుస్తకాలు, మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకొని, మంచి క్రమశిక్షణతో ఉజ్వాల భవిష్యత్తుకు మూలమైన విద్యను అభ్యసించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి విద్యార్థుల ప్రగతి, అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వందరోజుల ప్రణాళికలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. అనంత అనంతరం పదవ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ జగన్మోహన్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు రామ సుబ్బయ్య, విజయ కుమార్, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పార్వతమ్మ, హనుమంత పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు ని కలిసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి.



**ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 11:**
వెలగపూడిలోని సచివాలయం నందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని నేడు శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి కలిసి నియోజకవర్గంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే శ్రీశైలం, మహానంది దేవస్థానాల అభివృద్ధి, సాగునీటి పథకాలకు నిధుల మంజూరుతో పాటు నియోజకవర్గంలో 100శాతం అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, త్రాగునీటి కుళాయి సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలని వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు శ్రీశైలం నియోజకవర్గ అభివృద్ధికి మరింత తోడ్పాటును అందిస్తానని, పెండింగ్ లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేసి త్వరిత గతిన పూర్తి చేసేందుకు హామీ ఇచ్చారు.

# విజయవాడ కనకదుర్గమ్మ కు బయలుదేరిన భవానీలు.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల డిసెంబర్ 11:** శిరి వెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామానికి చెందిన 15 మంది భవానిలు 41 రోజులు భవాని దీక్షలో ఉండి గురువారం నాడు స్థానిక ఎస్సీ కాలనీలో గల రామాలయంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముడులు కట్టుకొని నెత్తిన పెట్టుకొని విజయవాడ కనకదుర్గమ్మకు బయలుదేరి వెళ్లారు. గ్రామం నుండి 15 మంది భవానీలు భవాని నామస్మరణతో దర్శనానికి బయలుదేరి వెళ్లారు. వీరిని గ్రామస్తులు భక్తులు బంధుమిత్రులు భవాని నామస్మరణతో సాధారణంగా సాగనంపారు. ఈ కార్యక్రమంలో భక్తులు చిన్నారులు మరియు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.ద

# నంద్యాల పరిపాలనకు రాష్ట్ర స్థాయి గుర్తింపు.. కలెక్టర్‌కు 4వ ర్యాంక్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 11:**



నంద్యాల జిల్లా పరిపాలన రాష్ట్రస్థాయి గుర్తింపును అందుకుంది. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా చేపట్టిన పరిపాలనా చర్యలు, ఫైళ్ల క్లియరెన్స్‌లో చూపుతున్న వేగం, ప్రజా సేవలో వినూత్న విధానాలు రాష్ట్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించాయి. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి మొత్తం 1,324 ఫైల్స్ స్వీకరించగా%ఔ% వాటిలో 1,169 ఫైల్స్‌ను వేగంగా, పారదర్శకంగా క్లియర్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని ప్రాధాన్యతగా తీసుకుని ప్రతి అంశాన్ని స్వయంగా పర్యవేక్షించడం ద్వారా పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేశారు.

ఈ సమగ్ర పనితీరును పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నంద్యాల జిల్లాకు రాష్ట్రంలో 4వ ర్యాంక్ కేటాయించారు. తొలి మూడు స్థానాల్లో కృష్ణా, నెల్లూరు, విజయనగరం జిల్లాలు నిలిచాయి. ఫీల్డ్ పర్యటనలు, శాఖలతో సమన్వయం, ఫైళ్ల డిస్పోజల్ వేగంఈ మూడు విభాగాల్లో కలెక్టర్ రాజకుమారి గణియా అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు అధికారులు పేర్కొన్నారు. నంద్యాల జిల్లాకు లభించిన ఈ ర్యాంక్ పరిపాలనలో కొత్త ప్రమాణాలు సృష్టించినట్టే.

# పారిశుద్ధ్య కార్మికులకు చీరెలు,దుస్తులు పంపిణీ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 11:**




నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు చీరెలు, దుస్తులు పంపిణీ చేశారు. నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ మాబున్నిసా, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న,వైస్ చైర్మన్ గంగిశెట్టి నాగ శ్రీధర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశుద్య కార్మికులు చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రతి కార్మికుడు ఉదయాన్నే పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరి కృషి అభినందనీయమన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు చీరెలు, దుస్తులు పంపిణీ చేస్తుందని అన్నారు. గతంలో పరిశుద్య కార్మికులకు చెప్పులు,సబ్బులు,తదితర వస్తువులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణా,శానిటరీ అధికారులు మురళి,లక్ష్మీనారాయణ,శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సర్వీసుల మెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి.

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 11:**
రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సర్వీసుల మెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఏపీ సచివాలయం లోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా సానుకూల అవగాహన పెంపు, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్లోడ్స్, జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు సంబంధించిన సంసిద్ధత, సేవల విజిబిలిటీ వంటి పలు కీలక అంశాలపై సమీక్ష జరిగింది. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్‌ఓ రామునాయక్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజల అభిప్రాయాన్ని మెరుగుపరచే దిశగా నంద్యాల జిల్లా అన్ని పారామీటర్లలో రాష్ట్రంలో టాప్ టెన్ లో నిలిపేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. సేవల నాణ్యత, ప్రజలకు అందుతున్న ఫలితాలు, ఫిర్యాదుల పరిష్కారం, పారదర్శక వ్యవస్థ వంటి అంశాల్లో ఏ పారామీటర్‌లోనూ జిల్లా దిగువ స్థానంలో లేకుండా సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూచించిన మార్గదర్శకాలను జిల్లా స్థాయిలో అధికారులు కట్టుబడి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖ ప్రజలకు చేరువ కావాలనీ, వారి సమస్యలు తక్షణమే పరిష్కరించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అంతేకాక, ఉత్తమ ప్రాక్టీసుల ఆధారంగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి చర్యలను విజయగాథల రూపంలో రూపొందించే పనిపై శాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచే విధంగా మంచి పద్ధతులను ప్రదర్శిస్తూ, ప్రజలకు ఉపయోగకరమైన సేవలను మరింత ప్రభావవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవల అందుబాటు కల్పించేందుకు అందరూ సమన్వయంతో, కట్టుదిట్టంగా పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లానింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్ ఎండి. ఫిరోజ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ డిసెంబర్ 11:**
నంద్యాల పట్టణ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఇటీవల ప్రారంభమైన కాన్స్టిట్యూఎన్సి విజన్%ఃఃడ% యాక్షన్ ప్లానింగ్ కేంద్రాన్ని సి వి ఏ యు పి తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి. ఫిరోజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు నుంచి విజన్ యాక్షన్ ప్లాన్ అమలు విధానాలు, ప్రస్తుతం నంద్యాలలో జరుగుతున్న అభివృద్ధి ప్రాజెక్టులు, భవిష్యత్ ప్రణాళికలను పరిశీలించిన అనంతరం ఎన్ ఎండి.ఫిరోజ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ స్వర్ణ ఆంధ్రప్రదేశ్ 2047 లో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి వార్డుప్రతి గ్రామం పై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. నంద్యాల ప్రజల అవసరాలు, సమస్యలు, ఫిర్యాదులు సాంకేతికంగా నమోదు చేసి వాటి పరిష్కారానికి రోడ్ మ్యాప్ సిద్ధం చేయడం ఈ కేంద్ర ప్రధాన లక్ష్యమన్నారు. నంద్యాల నియోజకవర్గంలో మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజ్, నీటి సరఫరా, గ్రామాలు,కాలనీల అభివృద్ధి వంటి అంశాల్లో శాస్త్రీయ పద్ధతిలో చర్యలు తీసుకునేందుకు ఈ యూనిట్ సహాయపడుతుందన్నారు.

అదే విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు సమయానుసారం జరుగుతున్నాయా లేదా అన్న దానిపై మానిటరింగ్ చేయడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. ఎన్ ఎండి ఫిరోజ్ కేంద్రాన్ని పరిశీలించి నంద్యాల ప్రజా సమస్యల పరిష్కారం మరియు నియోజకవర్గ అభివృద్ధి ప్రజాప్రయోజన దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్, మాజీ కౌన్సిలర్ మిద్దె హుస్సేని, మాబు జీలాన్, విజన్ యాక్షన్ ప్లాన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సురూర్ ఎ ఉర్దూ మహోత్సవ్ " పోస్టర్ల ఆవిష్కరణ.

### ఉర్దూ అకాడమీ" స్వర్ణోత్సవ " పోస్టర్ ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.

### స్వర్ణోత్సవ వేడుకల వివరాలను సీఎంకు తెలిపిన మైనారిటీ మంత్రి ఫరూక్.

**ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబరు11:**
ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ ఆవిర్భవించి 50 సంవత్సరాలైన సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ వేడుకలకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం రాత్రి ఆవిష్కరించారు. మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంకు విచ్చేసిన ముఖ్యమంత్రిని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూఖ్ షుబ్లీ కలిశారు. ఉర్దూ అకాడమీ ఏర్పడి 50 సంవత్సరాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని



సురూర్ ఎ ఉర్దూ మహోత్సవ్ పేరుతో నిర్వహిస్తున్న వారోత్సవ కార్యక్రమాల వివరాలను సీఎంకు మంత్రి ఫరూక్ వివరించారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహించి ఉర్దూ భాషాభివృద్ధికి, ఉర్దూను ద్వితీయ భాషగా మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రణాళికా బద్ధమైన చర్యలను ప్రజలకు వివరించేందుకు వారోత్సవ నిర్వహణ ఏర్పాట్లు చేయడం జరిగిందని మంత్రి ఫరూక్, ఉర్దూ అకాడమీ చైర్మన్ షుబ్లీ ముఖ్యమంత్రికి వివరించారు. స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మంత్రి ఫరూక్, ఉర్దూ అకాడమీ చైర్మన్ షుబ్లీ కి సీఎం చంద్రబాబు సూచించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం12 డిసెంబర్ 2025

# సొంత నిధులతో రోడ్డు కు మరమ్మత్తు పనులు చేయించిన బుగ్గ రాముడు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 11:** నంద్యాల పట్టణ శివారులోని 38వ వార్డు నందమూరి నగర్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన మదరస దగ్గర ఉన్న రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో 38వ వార్డు టిడిపి ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు రాష్ట్ర మంత్రి ఫరూక్, మరియు వారి కుమారులు ఫిరోజ్, ఫయాజ్ గార్ల ఆదేశాల మేరకు 38వ వార్డు టిడిపి ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు తన సొంత నిధులతో శిథిలావస్థకు చేరుకున్న రోడ్డుకు మట్టి తోలి, రోడ్డును బాగు చేశారు. ఈ సందర్భంగా తాటికొండ ముగ్గురాముడుకు నందమూరి నగర్ మరియు వైఎస్ఆర్ నగర్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



# నూనెపల్లె ఫ్లైఓవర్ కింద వ్యాపారం చేస్తున్న వారిని ఆదుకోవాలి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 11:** నూనెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఎన్నో ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేద వ్యాపారులను ఆదుకోవాలని కోరుతూ సీపీఎం పార్టీ జిల్లా నాయకులు ఎన్ఎండి ఫిరోజ్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ ఎండి. ఫిరోజ్ సానుకూలంగా స్పందిస్తూ సమస్య పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని,ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి తీసుకువచ్చి తప్పక సహాయం అందిస్తామని భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నంద్యాల జిల్లా నాయకులు నరసింహ, సీనియర్ నాయకులు మద్దులు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూల్ ఎంపీ బి. నాగరాజు కు ధన్యవాదములు.

## మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి

**ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 11:**
కర్నూల్ పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు గారు గౌరవ కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్ ని కలిసి వాల్మీకుల చిరకాల వాంఛ ఎస్టి పునరుద్ధరణ ఆవశ్యకతను వివరించి లెటర్ ను ఇవ్వటం ఈ రోజు లోకసభలో ప్రస్తావించడం పట్ల వారికి రాష్ట్ర వాల్మీకులందరి తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న,ఉపాధ్యక్షులు టి.జి.నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జయరాం,యూత్ నేత శివనాగేంద్ర,బొగ్గులైన్ ఓబులేసు,దేవనగర్ మల్లీ,రమేష్,నాగేష్,ఉప్పరిపేట శివ,వంశీ,గిరినాథ్ సెంటర్ నిఖిల్ ,మోహన్,మహేష్,సంగపేట వెంకులు, మహేష్,నాగరాజు,ఎంజీవోస్ కాలని పుల్లయ్య,హరి,రమణ,మధు తదితరులు అన్నారు.వాల్మీకుల న్యాయమైన డిమాండ్ పై కేంద్రం మీద వత్తిడి పెంచుతున్న రాయల సీమ జిల్లాల ఎంపీలు శబరి కి,అంబికా లక్ష్మినారాయణ వాల్మీకి కి,మిగతా ఎంపీలందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఖచ్చితంగా ప్రధాని తో చర్చించి పార్లమెంటులో ఆమోదం పొందేలా చెయ్యాలని,ముఖ్యమంత్రి చంద్రబాబు,రాష్ట్రప్రభుత్వం స్పందించకుండా ఉంటే న్యాయం జరగదని రాష్ట్ర ప్రభుత్వం ఖచ్చితంగా వాల్మీకులకు న్యాయం చేయాలని,లేని పక్షములో వాల్మీకులు నమ్మరని అది మీకే నష్టం జరుగుతుందని ఎందుకంటే 60 ఏళ్లుగా మాటలతో మోసపోతూనే ఉన్నామని ప్రతిదీ వాల్మీకులు గ్రహిస్తున్నారనే విషయం విస్మరించవద్దని విజ్ఞప్తి చేశారు.

# కృత్రిమమేధకు మైక్రోసాఫ్ట్ భారీ పెట్టుబడులు

**మైక్రోసాఫ్ట్ చైర్మెన్, సీఈవో సత్యా నాదెళ్ల వెల్లడి**

బెంగుళూరు,: భారత్‌లోని కృత్రిమమేధ వ్యవస్థకు తగిన రీతిలో మైక్రోసాఫ్ట్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ చైర్మెన్, సీఈవో సత్యా నాదెళ్ల తెలిపారు. క్లోడ్ కంప్యూటింగ్ వ్యవస్థను కూడా మైక్రోసాఫ్ట్ మరింత పటిష్టం చేసేందుకు పనిచేస్తున్నట్లు చెప్పారు. మైక్రోసాఫ్ట్ చైర్మెన్, సీఈవో సత్యా నాదెళ్ల ఇవాళ బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు.లక్షలాది మంది భారతీయులకు కృత్రిమ మేధపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. భారత్‌లో పెట్టుబడి పెట్టడం ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. ఉత్తమైన మౌళిక సదుపాయాల్ని కల్పించనున్నట్లు చెప్పారు. సుమారు 17.5 బిలియన్ల డాలర్ల పెట్టుబడి పెడుతున్నట్లు సత్యానాదెళ్ల తెలిపారు. ఆసియా ఖండంలోనే మైక్రోసాఫ్ట్‌కు చెందిన అత్యంత భారీ పెట్టుబడి ఇదేఅని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా క్లౌడ్ విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ చైర్మెన్ తెలిపారు. అజూర్ కంప్యూటర్ వ్యవస్థపై వర్క్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 70 కన్నా ఎక్కువ సంఖ్యలో డేటా సెంటర్లు ఉన్నాయన్నారు. భారత్‌లోనూ మైక్రోసాఫ్ట్ సెంటర్లు పెరుగుతున్నట్లు ఆయన చెప్పారు. గిట్‌హబ్ లో 2030 నాటికి ఇండియా నెంబర్ వన్‌గా మారుతుందని ఆయన అంచనా వేశారు. భారత్‌లో జియోతోనూ భాగస్వామ్యం ఉందన్నారు. 2026లో కొత్త డేటా సెంటర్ ప్రాంతం ఆపరేషనల్‌గా మారనున్నట్లు నాదెళ్ల చెప్పారు. దక్షిణమధ్య భారతంలో కొత్త డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోనున్నట్లు నాదెళ్ల పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సుమారు రెండు కోట్ల మంది భారతీయులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు నాదెళ్ల తెలిపారు. ప్రభుత్వానికి చెందిన ఈ-శ్రమ్ ప్రోగ్రామ్ ద్వారా అసంఘటిత కార్మికులను ఏఐతో చైతన్యపరచవచ్చు అన్నారు. భారత్‌లోని ప్రతి వ్యక్తిని, ప్రతి సంస్థను బలోపేతం చేయడమే తమ లక్ష్యమని నాదెళ్ల పేర్కొన్నారు.



# ఓర్వలేకనే వైసిపి నేతల విమర్శలు: ఎమ్మెల్యే యార్లగడ్డ

అమరావతి, **డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి** :ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిత్యం రివ్యూ మీటింగ్‌లు పెడుతూ రాష్టాన్ని రావణ కాష్టం నుంచి గట్టెక్కించి మళ్లీ గాడిలో పెట్టడానికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖలో దాదాపు 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి వారి కెరీర్‌కు భరోసా ఇచ్చారన్నారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో చెప్పినట్లుగా 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. గత అమెరికా పర్యటనలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఒక్క రోజు మాత్రమే చేసి మిగతా రోజుల్లో పరిశ్రమల కోసమే కృషి చేశారని చెప్పుకొచ్చారు. లోకేష్ ఇటీవల మూడు రోజుల్లోనే గూగుల్, ఆడోబ్, ఇన్‌టెల్, ఓపెన్ ఏఐ సహా దాదాపు 18 ప్రపంచ దిగ్గజ కంపెనీల సీఈఓలతో సమావేశమై పెట్టుబడుల కోసం రాష్ట్రానికి ఆహ్వానించారన్నారు. అంతర్జాతీయ కంపెనీల యజమానులతో లోకేష్ సమావేశం కావడం జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు కేవలం ఈర్ష్యతో పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని మండిపడ్డారు. మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఆ నగరాన్ని నేడు 2 లక్షల 90 వేల కోట్ల ఐటీ ఎగుమతులు చేసేలా చేసింది చంద్రబాబు నాయుడు కాదా అని ప్రశ్నించారు. ఆయనే స్ఫూర్తితో లోకేష్ బాబు గూగుల్‌ను వైజాగ్‌కు తీసుకొచ్చి ఆ నగరాన్ని పెట్టుబడుల స్వర్గధామం చేయబోతున్నారని అన్నారు. వైసీపీ మంత్రులు తమ హయాంలో ఎన్నిసార్లు రివ్యూ మీటింగ్‌లు పెట్టారో గణాంకాలతో చర్చకు రావాలని సవాల్ చేశారు. లోకేష్ బాబు తన వ్యక్తిగత పర్యటనలకు సొంత నిధులు వాడుతున్నారు తప్ప, ప్రభుత్వ డబ్బు వాడుకోవడం లేదని తెలిపారు. లోకేష్ ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారని నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని ఛాలెంజ్ చేశారు. ఓటమి తర్వాత కౌంటింగ్ సెంటర్ నుంచి వెళ్లిపోయి ఏడాది పాటు గుడివాడ మొహం చూడకుండా దాక్కున్న నాయకుడు ప్రజాతీర్పును గౌరవించలేదంటూ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వ్యాఖ్యలు చేశారు.

# రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామిని సత్కరించిన నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం

**నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయం సందర్శించిన చైర్మన్ నారాయణస్వామి.**

**విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తాం: నారాయణస్వామి.**

**ఆంధ్రప్రదేశ్ నంద్యాల డిసెంబర్ 11:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయం సందర్శించిన సందర్భంగా సంఘం తరపున గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, అధ్యక్షులు రమణయ్య, ప్రధాన కార్యదర్శి రామలింగం నారాయణ స్వామిని శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రకటించారని, వారి అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి కొనసాగిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే దివ్యాంగుల పెన్షన్ 3000 నుండి దేశంలో మరెక్కడ లేని విధంగా 6000 కు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి చెందుతుందని నారాయణస్వామి అన్నారు.

డాక్టర్ రవి కృష్ణ, రమణయ్య మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా కు కలిపి దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం కర్నూలులో కొనసాగుతుందని, నంద్యాల జిల్లాకు దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం ఏర్పాటు చేసి అధికారులను నియమించినట్లయితే జిల్లాలోని దివ్యాంగులకు అభివృద్ధి పథకాలను అమలు చేయడానికి అవకాశం మెరుగవుతుందని అన్నారు.


ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ, రమణయ్య లతో పాటు, సంఘం కార్యదర్శి రామలింగం, కార్యవర్గ సభ్యుడు రంగ స్వామి, కార్యాలయ కార్యదర్శి మధు పాల్గొన్నారు.



# థాయిలాండ్‌లో లూథ్రా సోదరుల అరెస్ట్

**త్వరలోనే భారత్‌కు అప్పగించనున్న అధికారులు**

న్యూఢిల్లీ **డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి** గోవా నైట్‌క్లబ్‌లో ఇటీవల భారీ అగ్ని ప్రమాదం సంభవించి 25 మంది మృతికి కారణమైన.. ఆ క్లబ్ యజమానులు అరెస్ట్ అయ్యారు. ప్రమాదం జరిగిన గంటల వ్యవధిలోనే ఓనర్లు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రా సోదరులు విదేశాలకు తరలివెళ్లారు. పరారీలో ఉన్న వారిని తాజాగా థాయ్‌లాండ్‌లో అక్కడి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 6న రాత్రి 'బిర్క్ బై రోమియో లేన్ క్లబ్'లో ఈ ప్రమాదం జరగ్గా.. కొన్ని గంటలకే నిందితులైన లూథ్రా సోదరులు పరారయ్యారు. డిసెంబర్ 7న తెల్లవారుజామున 5:30 గంటలకు థాయిలాండ్‌లోని పుకెట్ వెళ్లే ఇండిగో ఫ్లైట్ ఎక్కి విదేశాలకు పారిపోయి నట్టు తేలింది. దీంతో గాలింపు చర్యల్లో భాగంగా వారిపై లుక్‌అవుట్ నోటీసులు జారీచేశారు. ఈ నేపథ్యంలో వారి పాస్‌పోర్టు(ఖజీబబనీసబి)లు సస్పెండ్ చేశారు అధికారులు. కాబట్టి వారు చట్టం ప్రకారం ఆ దేశంలో ఉండటానికి అనర్హులు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అరెస్టైన లూథ్రా సోదరులను త్వరలోనే భారత్‌కు తరలించే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం గోవాకు చెందిన పోలీస్ బృందం థాయ్‌లాండ్‌కు వెళ్లనుంది. అంతకముందు.. అరెస్ట్‌కు భయపడి లూథ్రా సోదరులు ఇండియాకు తిరిగి వచ్చేందుకు నిరాకరించారు. ఈ విషయమై ముందస్తు బెయిల్ కోరుతూ ఢిల్లీలోని రోహిణీ కోర్టును కూడా ఆశ్రయించారు. తాము థాయ్‌లాండ్‌కు వెళ్లింది తప్పించుకోవడానికి కాదని, వ్యాపార పనుల నిమిత్తం మాత్రమేనని పేర్కొన్నారు.



# అమరావతికి శాశ్వత హెూదా.. పార్లమెంటులో బిల్లు పెడతాం: కేంద్ర మంత్రి పెమ్మసాని

**డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి శాశ్వత హెూదా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో గానీ, లేదా వచ్చే సమావేశాల్లో గానీ అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ బిల్లు ప్రవేశపెడతామని ఆయన తెలిపారు.రాజధానిని 2014 నుంచి గుర్తించాలా? లేక ఇప్పటి నుంచి గుర్తించాలా? అనే దానిపై ఉన్న సాంకేతిక కారణాల వల్లే బిల్లు ఆలస్యమవుతోందని పెమ్మసాని వివరించారు. ఈ ప్రక్రియను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అమరావతి బిల్లుపై వైసీపీ అధినేత జగన్ విషం కక్కుతున్నారని, ఆయనను శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు పాలన చేతకాకపోవడం వల్లే 34 వేల మంది రైతులు ఇచ్చిన భూములను సద్వినియోగం చేసుకోలేక రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేశారని ఆరోపించారు.అమరావతిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే వేలాది మంది నిర్మాణ పనుల్లో పాలుపంచుకుంటున్నారని పెమ్మసాని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే 16 జాతీయ సంస్థలకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. త్వరలోనే హడ్కో, కాగ్, పోస్టల్ భవనం, కేంద్రీయ విద్యాలయాలు వంటివి అమరావతిలో ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారుల నిర్మాణానికి కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశామని ఆయన వెల్లడించారు.

# ఎన్నికల సంస్కరణలపై చిత్తశుద్ధిలేని చర్చ !




డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి
పార్లమెంటులో ఎన్నికల సంస్కరణలపై చర్చ కాస్తా అసలు విషయాలను పక్కదారి పట్టించేలా ఉంది. అధికార బిజెపి లేదా ఎన్‌డిఎ కూడా పక్కాగా ఎన్నికల సంస్కరణల ప్రతిపాదనలు ప్రకటించడంలేదు. విపక్షనేత రాహుల్ కేవలం సర్‌ను వ్యతిరేకించడం మాత్రమే అలవాటు చేసుకున్నారు. ఇంటాబయటా ఆయన అదే పాట పాడుతున్నారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ఊరేగుతున్న రాహుల్‌కు రాజ్యాంగంలో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎందుకంటే ఎన్నికల ప్రక్రియ విఫలం అవుతోంది. డబ్బున్న వారే ఎన్నికవుతున్నారు. ఒక్కరే పదేపదే చట్టసభల్లో ఉంటున్నారు. వీలయితే జీవితాంతం చట్టసభ సభ్యులుగా ఉంటున్నారు. ఇక దొంగ ఓట్లను చేర్పించి, ఓట్లను చోరీ చేస్తున్నారు. పదేపదే ఎన్నికల నిర్వహణతో దేశ ఖజానాపై భారం మోపుతున్నారు. ఒకేదేశం, ఒకే ఎన్నిక అంటున్న బిజెపి కూడా దీనిపై సమగ్ర విధానం ప్రకటించడం లేదు. ఎన్నికల సంస్కరణలపై చరచ అంటూ తమ అనుకూలంగా లేని విషయాలపై పార్లమెంటులో చర్చిస్తున్నారు. మన ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాలను చర్చించాలి. ప్రధానంగా దేశానికి భారంగా మారిన పదేపదే ఎన్నికల నిర్వహణ విధానం మారాలి. అన్ని రాష్ట్రాల్లో ఒకే తడవలో ఎన్నికలు జరిగేలా చూడాలి. రాజకీయ పార్టీలు నిరంతరం ఎన్నికలు ఉండాలని కోరుకుంటున్నాయి. అలాగే తామే నిరంతరం ప్రజాప్రతినిధులుగా చట్టసభల్లో తిష్టవేయాలని చూసుకుం టున్నారు. ఇదే వీరి ఎన్నికల సంస్కరణగా ఉంది. దీనికోసమే అందరి ఆరాటంగా ఉంది. ఇందులో ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే ప్రజాస్వామ్యం ముసుగులో నియంతలుగా మారుతున్నారు. అసలు అధికారాలే తక్కువగా ఉంటే సమస్య రాదు. చట్టసభలకు ఎన్నికైన సభ్యులకు అలవిమాలిన సౌకర్యాలను కూడా తగ్గించాలి. పెన్షన్లు తక్షణం ఎత్తేయాలి. 2026 జనాభా గణన ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఒకే దేశం, ఒకేఎన్నిక అంటే పార్లమెంటు, రాష్ట్ర శానసభల కు ఒకేసారి ఎన్నికల నిర్వహణ జరగాలి. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ జరగాల్సిందే. అలాగే దొంగ ఓట్లు లేకుండా పక్కాగా ఓటరు కార్డు ఉండాలి. నిరంతరం ఓటరు జాబితాను సమీక్షించే అవకాశం రావాలి. ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటేసేలా చట్టబద్ధత ఉండాలి. నేతలు రెండు పర్యాయాలకు మించి పోటీ చేసే అవకాశం లేకుండా చూడాలి. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియపై రాజీవ్ గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, లెఫ్ట్ పార్టీలు ఎందుకు అభ్యంతరం చెబుతున్నాయో చెప్పాలి. నిజమైన ఓటర్లే జాబితాలో ఉండాలనే దానిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో జాతికి తెలియ చేయాలి. ఒక దేశం, ఒక ఎన్నిక అనేది బీజేపీకి ప్రయోజనాలను సమకూరుస్తుందనే వాదనలో పసలేదు. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల అధికారంలో ఉన్న పార్టీకి పరిస్థితులు అనుకూలమవుతాయని చెబుతున్న మాటల్లో కూడా నిజం లేదు. ప్రజలు తక్కువ అంచనా వేయడం సరికాదు. ఓటుహక్కు నిరాకరణకు గురైనవారిలో ఎవరున్నా వారి పేర్లు బయటపెట్టి చూపగలగాలి. అలా చేయకుండా సర్ ప్రక్రియను వ్యతిరేకించడం సరికాదు. పార్లమెంటులో 'ఎన్నికల సంస్కరణల'పై చర్చ తలాతోకా లేకుండా సాగింది. ఎన్నికల సంస్కరణ అనేది ఓటర్లకు సంబంధించినది మాత్రమే కాదు. యావత్తు భారత జాతికి సంబంధించినది. ఇది పార్లమెంటులో ప్రస్తుతం ఉన్న ఎంపిల వ్యవహారం అస్సలు కానేకాదు. తమను అత్యున్నత చట్టసభకు తీసుకువచ్చి, తద్వారా అధికారాన్ని అప్పగించిన ఓటర్లు తమ ఓటు దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సి ఉంది. పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం నియమ నిబంధనలను మార్చాల్సిన ఆవశ్యకత విషయమై పార్లమెంటేరియన్లంతా చర్చించాలి. అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి విజేత అవుతాడు. అలాంటి సమయంలో దొంగ ఓటర్లంతా ఓటేస్తే..తద్వారా ఎన్నికైన వారంతా ప్రజా ప్రతినిధులు ఎలా అవుతార్నదే ప్రశ్న. అలాగే ఎన్నికలలో ధనబలం, కండబలం ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకురావాల్సిన చట్టాల గురించీ ప్రధానంగా చర్చించాలి. ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికత చాలా ముఖ్యం అన్న విషయం ఇక్కడ గుర్తించాలి. నిజానికి ఎన్నికల 'సంస్కరణల' గురించి కాకుండా ప్రస్తుత పాలకులు, విపక్షాలు కలసి తమకు అనుకూలంగా ఉండే విషయాలనే ప్రస్తావిస్తున్నారు. దానిపైనే చర్చిస్తున్నారు. ఎన్నికల వ్యవస్థలో ఉన్న లోపాల కారణంగా రాజకీయ నేతలు అనుసరిస్తున్న వికృతాలను నిరోధించేందుకు పార్లమెంటు చర్చించడం కూడా ముఖ్యం. ఎన్నికలలో అక్రమాలు భారత్‌కే పరిమితం కాలేదు. ఎన్నికల నిర్వహణ అమలు చేస్తున్న అన్ని దేశాల్లో ఈ జాడ్యం ఉంది. ఉన్న నియమాలను నిరంకుశ పాలకులు తమకు అనుకూలంగా మార్చుకోవడమనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నది. నియంతలు తమ ఇష్టారాజ్యంగా ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టిస్తూనే వస్తున్నారు. తమకు ప్రజల మద్దతు పూర్తిగా ఉన్నదని చూపడానికి దొంగ ఓట్లతో సాయం పొందుతున్నారు. రాజ్యాంగ సంస్థను తమకు అనుకూలంగా మార్చు కుంటున్నారు. ఎన్నికల నియమాలు పూర్తిగా తమకు అనుకూలంగా ఉండేలా చేస్తున్నారు. అందువల్ల మొదట నియమ నిబంధనలు మార్చాల్సి ఉంది. ప్రధానంగా ప్రజల భాగస్వామ్యం పెరగాలి. పేదలైన ప్రజలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం రావాలి. అవసరమైతే ఇందుకు నిబంధనలు లేదా రిజర్వేషన్లు పెట్టాలి. చట్టసభల్లో నిరంతరం కొత్తవాళ్లు ఎన్నికలైతేనే అవినీతి, మోనోపలి తగ్గుతుంది.

జాస్వామ్య వ్యవస్థను క్రమంగా నిరంకుశత్వం వైపు మళ్లించకుండా అడ్డుకోగలుగుతాం. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన నాయకులకు కాల పరిమితి ఉంటే అవినీతికి అంతగా ఆస్కారం ఉండదు. అందువల్ల ఎన్నికల సంస్కరణల ఆవశ్యకతను గుర్తించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయాలి. అంతేగాకుండా ఓటు వేయమన్నది బాధ్యత కూడా కావాలి. కావాలని ఓటేయని వారినిశిక్షించే పరిస్థితి కూడా ఉండాలి. ఇవన్నీ సాధ్యమైతేనే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడగలదు.




## నరసాపురం వరకు వందేభారత్ పొడిగింపు

### 15 నుంచి జనవరి 11 వరకు అమలు

చెన్నై, డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి
చెన్నై సెంట్రల్–విజయవాడ మధ్య నడుపుతున్న వందే భారత్ రైళ్లను పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వరకు తాత్కాలికంగా పొడిగించారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నెం.20677 చెన్నై సెంట్రల్–నరసాపురం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి జనవరి 11వ తేది వరకు చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయల్దేరి 7.05 గంటలకు రేణిగుంట, 8.29 గంటలకు నెల్లూరు, 9.43 గంటలకు ఒంగోలు, 11.08 గంటలకు విజయవాడ(÷ఎతితీజాజీలిజీటజీ), మధ్యాహ్నం 12.29 గుడివాడ, 1.14 గంటలకు భీమవరం టౌన్, 2.10 గంటలకు నరసాపురం చేరుకుంటుంది.మరుమార్గంలో, నెం.20678 నరసాపురం–చెన్నై సెంట్రల్ వందే భారత్ ఈ నెల 17 నుంచి జనవరి 11వ తేది వరకు నరసాపురం(ఔజీసజీబజూబీసజీప)లో మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి 3.19 గంటలకు భీమవరం టౌన్, సాయంత్రం 4.04 గంటలకు గుడివాడ, 4.50 గంటలకు విజయవాడ, 6.29 గంటలకు ఒంగోలు, రాత్రి 7.39 గంటలకు నెల్లూరు, 9.50 గంటలకు రేణిగుంట, 11.45 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.



## భవానీ భక్తులతో ఇంద్రకీలాద్రి కిటకిట

### దీక్షల విరమణకు భారీగా చేసుకున్న భక్తులు

విజయవాడ, డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి
విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం భవానీ భక్తులతో కిటకిటలాడింది. భవాని దీక్ష విరమణలు గురువారం నుంచి 5 రోజులపాటు కొనసాగనున్నాయి. దీంతో వారంతా భారీగా తరలివస్తున్నారు. ఇంద్రకీలాద్రిలో 11వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు భవానీ దీక్షా విరమణలు ఉండటంతో దేవస్థానం పాలక మండలి ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అగ్ని ప్రతిష్టాపనతో ఇరుముడులు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. హోమ గుండాలను దుర్గగుడి ఈవో, చైర్మన్, ఆలయ స్థానాచారి వెలిగించారు. జై దుర్గా.. జై జై దుర్గా నామస్మరణతో మార్మోగుతోంది ఇంద్రకీలాద్రి. ఈ సందర్భంగా ఆలయ ఈవో శీనా నాయక్, చైర్మన్ బొర్రాగాంధీ మీడియాతో మాట్లాడారు. భవానిల దీక్ష విరమణ సందర్భంగా.. ఇరుముడిని సమర్పించడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి ఏడాది భవానీల సంఖ్య పెరుగుతోందని వివరించారు. ఇరుముడలను సమర్పించడానికి మూడు హోమగుండాలను ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. 41 రోజులపాటు నియమ నిబంధనలు పాటిస్తూ భవానీలు మాలధారణ చేశారని తెలిపారు. భవాని భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, వెయిటింగ్ హాల్స్, అదనపు పార్కింగ్, 19 ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఏపీ నలుమూలల నుంచి 7 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని చెప్పుకొచ్చారు. లక్షలాదిగా తరలివచ్చే భవానీలకు తాగునీరు, ప్రసాదం కొరత లేకుండా అందించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. 950 మంది క్షురకులు 4,000 మంది పోలీసు సిబ్బంది, 370కు పైగా సీసీ కెమెరాలతో భద్రతను పటిష్ఠం చేశామని పేర్కొన్నారు. అన్ని అర్జిత సేవలు డిసెంబర్ 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిలిపివేశామని తెలిపారు.

గిరి ప్రదక్షిణ మార్గంపై వివరాలను అందించే భవానీ దీక్ష 2025 మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. 9 కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. భక్తులకు ఎప్పటిక ప్పుడు మానిటరింగ్ చేసే విధంగా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని అన్నారు. సామాన్య భక్తుడికి పెద్దపీఠం వేశామని .. భవానీల కోసం ఉచిత క్యూలైన్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.



## అనంతపురం జిల్లాలో దారుణం

### నలుగురు ఇంటర్ విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం

### హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు..పరిస్థితి విషమం

అనంతపురం, డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి అనంతపురం జిల్లాలో దారుణం జరిగింది. కేఎస్ఆర్ జూనియర్ కాలేజీలో నలుగురు బాలికలు పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నలుగురు విద్యార్థినులు వాస్మోల్ తాగి ఆత్మహత్యయత్నం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. నగరంలోని కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో తాడిపత్రి మండలానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్లు చదువుతున్నారు. విద్యార్థినుల గురించి తల్లిదండ్రులకు వార్డెన్ వసంత ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థినులు భయపడి ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం గమనించిన వార్డెన్ వెంటనే వారిని చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బాలికల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకుని ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు విద్యార్థినుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చేరుకున్నారు. బాలికల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అయితే, ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను వెల్లడించేందుకు నిరాకరిస్తున్నారు కుటుంబ సభ్యులు. ఈ ఘటనతో మిగతా విద్యార్థినులు కూడా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

## హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా ప్రవాస భారతీయుడు

### ఉదయ్ నాగరాజు ఎన్నికపై కెటిఆర్ అభినందనలు

హైదరాబాద్, డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి
బ్రిటన్ ఎగువ సభ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా ప్రవాస భారతీయుడు ఉదయ్ నాగరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా ఆయన ప్రస్థానాన్ని కొనియాడారు. ఇంగ్లండ్ రాజు చేతుల మీదుగా హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడిగా నామినేట్ అయినందుకు ఉదయ్ నాగరాజు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నానన్నారు. యూకేలో పబ్లిక్ ఆఫీస్ కోసం పోటీ చేయడం దగ్గరి నుంచి మొదలుకొని.. నేడు ఈ అరుదైన గౌరవం దక్కించుకోవడం వరకు ఆయన ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. కొత్త బాధ్యతల్లో మీకు అంతా మంచే జరగాలని, మరిన్ని విజయాలు సాధించాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఉదయ్ నాగరాజు స్వస్థలం సిద్దిపేట జిల్లా కొహెడ మండలం శనిగరం. సామాన్య మధ్య తరగతి కుటుంబంలో హనుమంత రావు–నిర్మలాదేవి దంపతులకు జన్మించారు. ఆయన వరంగల్, హైదరాబాద్‌లో చదువుకున్నారు. బ్రిటన్‌లోని ప్రముఖ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లండన్‌లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ చేశారు. ఆయన ఏఐ ప్రభావాన్ని ముందే పసిగట్టి ఏఐ పాలసీ లాబ్స్ పేరుతో థింక్ ట్యాంక్‌ని నెలకొల్పారు. అలాగే, అంతర్జాతీయ స్థాయిలో వక్తగా పేరుపొందారు. ఇక హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు సభ్యులను ప్రధాని సలహా మేరకు ఇంగ్లండ్ రాజు నామినేట్ చేస్తుంటారు. రాజకీయ పార్టీలు, స్వతంత్ర కమిటీ, ప్రజల నుంచి సైతం నామినేషన్లు వస్తుంటాయి. నైపుణ్యం, అనుభవం, దేశానికి చేసిన సేవ ఆధారంగా హౌస్ ఆఫ్ లార్డ్స్‌కి ఎంపిక చేస్తారు. బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ పని చట్టాలను రూపొందించడం, ప్రభుత్వాన్ని పర్యవేక్షించడం, తదితర అంశాలపై చర్చించడం వంటి విధులు నిర్వహిస్తుంది.




## ఇండిగో బంపర్ ఆఫర్

### ఒక్కో ప్రయాణికుడికి పదివేల గిఫ్ట్ ట్రావెలర్ ఓచర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి ) కొన్ని రోజులుగా తీవ్ర సంక్షోభంలో ఇరుక్కున్న దేశీయ విమానయాన సంస్థ ఇండిగో. పరిస్థితులు ఇప్పుడు దాదాపు సాధారణ స్థితికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల.. ఇండిగో ఫ్లైట్ సర్వీసులు రద్దు కావడంతో ఇబ్బందిపడిన ప్రయాణికులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. వారికి పరిహారం కింద రూ.10 వేల విలువైన ట్రావెల్ ఓచర్ అందిస్తామని స్పష్టం చేసింది. ఇండిగో సంస్థకు చెందిన వందలాది విమానాలు ఒక్కసారిగా రద్దవడంతో.. ఈనెల 3, 4 , 5 తేదీలలో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేల మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టు(ంతిసూనీసబి)ల్లో చిక్కుకుని తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో వారికి ఉపశమనం కలిగిస్తూ.. పరిహారం చెల్లించే దిశగా ముందడుగేసింది ఇండిగో. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(ఆఉఅం) మార్గదర్శకాలకు అనుగుణంగా బాధిత ప్రయాణికులకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకూ ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నట్టు పేర్కొంది. రద్దయిన విమానాల కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు కోరిన ఇండిగో.. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూసుకుంటామంది. కంపెనీ అందించే ఈ ట్రావెల్ ఓచర్ విలువ రూ.10వేల వరకూ ఉండనుంది. రానున్న 12 నెలల్లో తమ సంస్థకు చెందిన్గ ÷÷–లట్లైలో ప్రయాణించేందుకు వీటిని ఉపయోగించుకోవచ్చని తెలిపింది ఇండిగో. అయితే.. ఏయే ప్రయాణికులకు ఎంత మేర పరిహారం కింద చెల్లిస్తారనే వివరాలపై ఇంకా స్పష్టత రాలేదు.




## ఆ రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ గడువు పొడిగించిన ఎన్నికల సంఘం



న్యూఢిల్లీ, డిసెంబర్ 11,ఆంధ్ర ప్రగతి
కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) గురువారం ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును వారం రోజుల పాటు పొడిగించింది. ఈ పొడిగింపు తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్, అండమాన్ అండ్ నికోబార్ దీవులకు వర్తిస్తుంది.

సవరించిన షెడ్యూల్ ప్రకారం తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో ఎస్ఐఆర్ గడువు డిసెంబర్ 14 (ఆదివారం)తో ముగియాల్సి ఉండగా, దీనిని డిసెంబర్ 19 (శుక్రవారం) వరకు పొడిగించారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ అండ్ నికోబర్‌లలో డిసెంబర్ 18 నుంచి డిసెంబర్ 23 వరకు, ఉత్తర ప్రదేశ్‌లో డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 31 వరకు గడువును పొడిగించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యవస్థీకృత పద్ధతిలో పూర్తి చేయడానికి, కచ్చితమైన, నవీకరించబడిన ఓటర్ల జాబితాను నిర్ధారించడానికి మరో రెండు వారాల సమయం ఇవ్వాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా వెల్లడించారు. మరణించిన, బదిలీ చేయబడిన, గైర్హాజరైన ఓటర్లకు సంబంధించిన వివరాలను ధృవీకరించడానికి వీలుగా గడువును పొడిగించినట్లు ఆయన తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం12 డిసెంబర్ 2025

# రోహిత్, విరాట్‌కు గంభీర్ ఆ క్రెడిట్ ఇవ్వలేదు

**- మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప విమర్శ**

స్వదేశంలో సౌతాఫ్రికాతో భారత్ ఇటీవల వన్డే సిరీస్ నెగ్గడంలో స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కీలక పాత్ర పోషించారు. రోహిత్ శర్మ మూడు మ్యాచ్‌ల్లో రెండు హాఫ్ సెంచరీలతో మెరిస్తే, విరాట్ ఏకంగా రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ బాది సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అలాంటిది సిరీస్ విజయం తర్వాత ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ ఈ ఇద్దరి గురించి ప్రస్తావించలేదని మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప అన్నాడు. అలాగే గంభీర్ వాళ్లకు దక్కాల్సిన క్రెడిట్ ఇవ్వలేదని ఉతప్ప విమర్శించాడు. "సౌతాఫ్రికా వన్డే సిరీస్ తర్వాత జరిగిన విలేకరుల సమావేశంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ క్రెడిట్ ఇవ్వడం నేనైతే చూడలేదు. ఈ ఇద్దరు ఆటగాళ్లు సిరీస్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. తమ ఫామ్‌పై వస్తున్న సందేహాలకు ఈ ప్రదర్శనతో చెక్ పెట్టి అందరి నోళ్లు మూయించారు. అలాగే తాము ఫామ్‌లో ఉంటే టీమ్‌ఇండియాకు ఎంత చేయగలరో అంత చేసి చూపించారు. అలాంటిది గంభీర్ వాళ్ల గురించి మాట్లాడకపోవడం మాత్రం విచిత్రంగా ఉంది" అని ఉతప్ప తన యూట్యూబ్ ఛానెల్‌లో పేర్కొన్నాడు. అయితే రోహిత్, విరాట్‌కు హెడ్‌కోచ్ గంభీర్‌తో ఇప్పటికే విభేదాలు ఉన్నాయని ప్రచారం సాగుతున్న వేళ ఉతప్ప వ్యాఖ్యలు పుకార్లకు బలం చేకూరుస్తున్నాయి. 'నిజంగానే సీనియర్లు గంభీర్ పట్టించుకోవడం లేదా' అన్న సందేహాలు క్రికెట్ అభిమానుల్లో కలుగుతున్నాయి. ఇక గతేడాది టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన అనంతరమే రో-కో పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ఇచ్చేశారు. అయితే గంభీర్ ఒత్తిడి వల్లే ఈ ఇద్దరూ టెస్టులకు గుడ్ బై చెప్పారన్న ప్రచారం కూడా సాగుతోంది. ఈ ఏడాది అక్టోబర్‌లో ఆస్ట్రేలియాలో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ సంచలనం సృష్టించాడు. ఈ సిరీస్‌లో హిట్‌మ్యాన్ 101 సగటుతో 202 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీ సాధించాడు. దీంతో రోహిత్‌కు ఈ సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ దక్కింది. ఇక ఇప్పటిదాకా రోహిత్ శర్మ 279 వన్డేల్లో 271 ఇన్నింగ్స్‌లలో 11,516 పరుగులు చేశాడు. ఇందులో వాటిలో 33 సెంచరీలు, 61 అర్ధ సెంచరీలు ఉన్నాయి.మరోవైపు, విరాట్ భారత్‌లో ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో అద్భుతంగా రాణించాడు. రెండు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీ సహా 302 పరుగులు సాధించి ఔరా అనిపించాడు. రాంచీలో 135 పరుగులు, రాయ్‌పుర్‌లో 102 పరుగులు, విశాఖపట్నంలో 65 పరుగులు చేశాడు. దీంతో విరాట్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కింది. ఓవరాల్‌గా విరాట్ 308 వన్డేల్లో 296 ఇన్నింగ్స్‌ల్లో 14,557 పరుగులు చేశాడు. ఇందులో 53 సెంచరీలు, 76 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.




# జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో భారత్‌కు బ్రాంజ్ మెడల్



2025 పురుషుల జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో భారత్‌కు బ్రాంజ్ మెడల్ దక్కింది. రీసెంట్‌గా ఈ టోర్నీలో సెమీఫైనల్‌లో ఓడిన భారత్, తాజాగా మూడో స్థానం కోసం అర్జెంటీనాతో తలపడింది. ఈ మ్యాచ్‌లో అర్జెంటినాపై ఆధిపత్యం సాధించిన భారత్ 4-2 తేడాతో నెగ్గి, బ్రాంజ్ మెడల్ దక్కించుకుంది. ఈ మ్యాచ్‌లో అదరగొట్టిన అన్‌మోల్ ఎక్కాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.భారత జట్టులో అంకిత్ పాల్, మన్మీత్ సింగ్, శ్రద నంద్ తివారీ, అన్‌మోల్ ఎక్కా తలో ఒక గోల్ సాధించారు. అర్జెంటీనా తరపున నికోలస్ రోడ్రిగ్జ్, శాంటియాగో ఫెర్నాండెజ్ గోల్స్ చేశారు. దీంతో భారత్ 4-2 తేడాతో నెగ్గి టోర్నీని మూడో స్థానంతో ముగించింది. అయితే ఈ టోర్నీ చరిత్రలో భారత్ మూడో స్థానంలో నిలవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ టోర్నీలో మూడో స్థానంలో నిలిచిన భారత్‌కు హాకీ ఇండియా క్యాష్ రివార్డ్ ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో అధికారికంగా అనౌన్స్ చేసింది. దీంతో ఒక్కో ప్లేయర్‌కు రూ.5 లక్షల నజరానా అందనుంది. అలాగే సపోర్టింగ్ స్టాఫ్‌లోని ఒక్కొక్కరికి రూ.2.5 లక్షలు ఇవ్వనున్నారు. కాగా, భారత్ చివరిసారిగా 2016లో జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో విజేతగా నిలిచింది. ఆ తర్వాత 2021, 2022 ఎడిషన్లలో నాలుగో స్థానానికే పరిమితం అయ్యింది. ఈసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్ రీసెంట్‌గా సెమీఫైనల్‌లో 1- 5 తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ చేతిలో ఓడింది. ఇక ఈ టోర్నీలో భారత్ 2001, 2016లో రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచింది.కాగా, ఈ టోర్నీలో జర్మనీ ఛాంపియన్‌గా నిలిచింది. బుధవారం స్పెయిన్‌తో జరిగిన ఫైనల్‌లో జర్మనీ షూటౌట్‌లో 3- 2తో నెగ్గి విజేతగా అవతరించింది. ఫైనల్ మ్యాచ్‌లో నిర్ణీత సమయం ముగిసే సమయానికి స్కోర్లు 1- 1తో సమం అయ్యాయి. దీంతో మ్యాచ్ షూటౌట్ రౌండ్‌కు వెళ్లింది. ఇందులో డిఫెండింగ్ ఛాంపియన్ స్పెయిన్‌పై జర్మనీనే నెగ్గింది. కాగా, జూనియర్ హాకీ ప్రపంచకప్ నెగ్గడం జర్మనీకి ఇది ఎనిమిదోసారి కావడం విశేషం. ఇక గత ఎడిషన్‌లోనూ ఛాంపియన్‌గా నిలిచిన జర్మనీ, ఈ టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగింది. ఫైనల్‌లో అద్భుతంగా పోరాడినప్పటికీ స్పెయిన్ రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

# ఐపీఎల్ వేలంలో తొలిసారి శ్రేయాస్ అయ్యర్..




ఐపీఎల్ 2026 మినీ వేలానికి రంగం సిద్ధమైంది. డిసెంబర్ 16న అబుదాబి వేదికగా జరగనున్న ఈ వేలంలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకోనుంది. పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ తొలిసారిగా వేలంపాటలో పాల్గొననున్నాడు. సాధారణంగా జట్టు యజమానులు, కోచ్‌లు వేలంలో పాల్గొంటారు. కానీ, ఈసారి కెప్టెన్ అయ్యర్ స్వయంగా వేలం టేబుల్ వద్ద కనిపించనున్నాడు.పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ ఈ వేలానికి దూరంగా ఉండనున్నాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ జరుగుతోంది. ఈ సిరీస్‌కు కామెంటేటర్‌గా రికీ పాంటింగ్ వ్యవహరిస్తున్నాడు. ఈ బిజీ షెడ్యూల్ కారణంగా ఆయన అబుదాబికి రాలేకపోతున్నాడు. అందుకే, జట్టు బాధ్యతలను సమన్వయం చేసుకునేందుకు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ వేలంలో పాల్గొననున్నాడు. మరోవైపు, శ్రేయాస్ అయ్యర్ ప్రస్తుతం గాయం కారణంగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ ఆడుతుండగా క్యాచ్ పట్టే క్రమంలో అతని పక్కటెముకలకు గాయమైంది. దీనికి శస్త్రచికిత్స కూడా జరిగింది. ప్రస్తుతం కోలుకుంటున్న అయ్యర్, జనవరి 2026లో న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్ ద్వారా మళ్లీ జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఖాళీ సమయం ఉండటం వల్ల ఆయన వేలానికి హాజరవుతున్నాడు.పంజాబ్ కింగ్స్ జట్టు ఇప్పటికే సమతుల్యంగా ఉంది. ఈ మినీ వేలంలో వారు కేవలం నలుగురు ఆటగాళ్లను మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్దగా కొనుగోళ్లు లేకపోవడంతో కోచ్ లేకుండానే, కెప్టెన్, ఇతర సిబ్బందితో వేలం ప్రక్రియను పూర్తి చేయాలని పంజాబ్ యాజమాన్యం భావిస్తోంది.గతంలో రిషబ్ పంత్ కూడా ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఇలాగే వేలంలో పాల్గొన్న విషయం తెలిసిందే. ఇప్పుడు అయ్యర్ కూడా అదే బాటలో నడుస్తూ, తన జట్టు కూర్పులో కీలక పాత్ర పోషించనున్నాడు.

# తుది జట్టులో మార్పులు చేయలేదు

**• సూర్యకుమార్ యాదవ్**

సౌతాఫ్రికాతో రెండో టీ20లో టీమిండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సూర్యకుమార్ యాదవ్ మరో ఆలోచన లేకుండా ఛేజింగ్‌కు మొగ్గు చూపాడు. డ్యూ ఫ్యాక్టర్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పాడు. డ్యూ పరిస్థితుల్లో ముందుగా బౌలింగ్ చేయడం మంచి ఆప్షన్ అని తెలిపాడు.'మేం ముందుగా బౌలింగ్ చేస్తున్నాం. డ్యూ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ముందుగా బౌలింగ్ చేయడం మంచి ఆప్షన్. ఇదో అద్భుతమైన మైదానం. ఇక్కడ తొలి పురుషుల మ్యాచ్ జరుగుతుంది. ఎంతో ఉత్సాహంగా ఉంది. మా కుర్రాళ్లు బాధ్యతతో ఆడటం చాలా ముఖ్యం. గత మ్యాచ్‌లో 175 మంచి స్కోర్. మా బౌలర్లు కూడా అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు. హార్దిక్ పాండ్యాతో జట్టు సమతూకంగా ఉంటుంది. అతను కూల్‌గా ఆడటం, బౌలింగ్ చేయడం జట్టుకు కీలకం. మేం విన్నింగ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతున్నాం.'అని సూర్యకుమార్ యాదవ్ చెప్పుకొచ్చాడు.టాస్ గెలిస్తే తాము కూడా ముందుగా బౌలింగ్ చేసేవాళ్లమని ఎయిడెన్ మార్క్రమ్ తెలిపాడు. 'మేం కూడా ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. వికెట్ చాలా బాగుంది. భారీ స్కోర్ చేసి భారత్‌పై ఒత్తిడి తేవాలనుకుంటున్నాం. ప్రతీ మ్యాచ్ ఓ గుణపాఠమే. కొన్నిసార్లు మనకు కలిసిరాదు. ఈ పిచ్ గురించి కొన్ని ఓవర్ల తర్వాత మాకు ఫీడ్‌బ్యాక్ వస్తుంది. మేం భారీ లక్ష్యాన్ని నమోదు చేయాలనుకుంటున్నాం. మా జట్టులో మూడు మార్పులు చేశాం. రీజా, లిండే, బార్ట్‌మాన్ జట్టులోకి వచ్చారు.'అని మార్క్రమ్ చెప్పుకొచ్చాడు.




# రెండో టీ20లో టీమిండియా ఓటమి...

# తిలక్ వర్మ ఒంటరిపోరు వృథా

సఫారీలతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఆతిథ్య భారత్ ఓటమిపాలైంది. ముల్లన్ పూర్ లో దక్షిణాఫ్రికా అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి 51 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. క్వింటన్ డికాక్ (90) మెరుపు ఇన్నింగ్స్‌కు, ఒట్నీల్ బార్ట్‌మన్ (4/24) అద్భుత బౌలింగ్ తోడవడంతో టీమిండియాకు ఓటమి తప్పలేదు. తిలక్ వర్మ (62) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకుండా పోయింది.

214 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. శుభ్‌మన్ గిల్ (0) తొలి బంతికే వెనుదిరగ్గా, అభిషేక్ శర్మ (17), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (5) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. దీంతో 32 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన యువ బ్యాటర్ తిలక్ వర్మ (34 బంతుల్లో 62బీ 2 ఫోర్లు, 5 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. హార్దిక్ పాండ్య (20), జితేష్ శర్మ (27)తో కలిసి భాగస్వామ్యాలు నిర్మించాడు. అయితే, టీమిండియా బ్యాటర్లు పెరిగిన రన్‌రేట్ ఒత్తిడిని తట్టుకోలేకపోయారు.

ఒకవైపు తిలక్ వర్మ పోరాడుతున్నా, మరోవైపు వికెట్లు పడుతూనే ఉన్నాయి. దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేసి భారత బ్యాటర్లను కట్టడి చేశారు. ముఖ్యంగా ఒట్నీల్ బార్ట్‌మన్ నాలుగు కీలక వికెట్లు పడగొట్టి భారత పతనాన్ని శాసించాడు. అతనికి మార్కో యాన్సెన్, లుంగి ఎంగిడి, సిపామ్లా తలో రెండు వికెట్లతో చక్కటి సహకారం అందించారు. ఫలితంగా భారత జట్టు 19.1 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌట్ అయి ఓటమిని అంగీకరించింది.అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణయం తప్పని దక్షిణాఫ్రికా బ్యాటర్లు నిరూపించారు. ఓపెనర్ క్వింటన్ డికాక్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 46 బంతుల్లో 5 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 90 పరుగులు చేసి భారత బౌలర్లకు చుక్కలు చూపించాడు. కెప్టెన్ మార్క్రమ్ (29)తో కలిసి రెండో వికెట్‌కు 83 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. చివర్లో డొనోవాన్ ఫెరీరా (16 బంతుల్లో 30), డేవిడ్ మిల్లర్ (12 బంతుల్లో 20) మెరుపులు మెరిపించడంతో దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగుల భారీ స్కోరు చేసింది. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి (2/29) ఒక్కడే కాస్త పొదుపుగా బౌలింగ్ చేయగా, అర్ష్‌దీప్ సింగ్ (54), జస్‌ప్రీత్ బుమ్రా (45) భారీగా పరుగులు సమర్పించుకున్నారు.

కాగా, ఈ విజయంతో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ ను దక్షిణాఫ్రికా 1-1తో సమం చేసింది. ఇరు జట్ల మధ్య మూడో టీ20 మ్యాచ్ డిసెంబరు 14న ధర్మశాలలో జరగనుంది.



## ‘అఖండ 2’ సినిమాకు తెలంగాణ హైకోర్టు షాక్...
# టికెట్ రేట్ల పెంపు జీవో రద్దు



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న ‘అఖండ 2’ చిత్రానికి విడుదల ముందు ఊహించని షాక్ తగిలింది. తెలంగాణలో ఈ సినిమా ప్రీమియర్ షోలు, టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు సస్పెండ్ చేసింది. మరికొన్ని గంటల్లో ప్రీమియర్లు ప్రారంభం కానుండగా ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. వివరాల్లోకి వెళితే, ‘అఖండ 2’ సినిమాకు ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడం, టికెట్ ధరలు పెంచుకోవడానికి వీలు కల్పించడాన్ని సవాలు చేస్తూ అడ్వకేట్ పాదూరి శ్రీనివాస్ రెడ్డి హైకోర్టులో లంచ్-మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ చేపట్టిన న్యాయస్థానం, ప్రభుత్వ జీవోను తక్షణమే నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర హోంశాఖ, చిత్ర నిర్మాత, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. బాలకృష్ణ కథానాయకుడిగా రూపొందిన ఈ భారీ యాక్షన్ చిత్రం రేపు (డిసెంబర్ 12) ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ రాత్రికి ప్రీమియర్ షోలు పడనున్నాయి. ఇందులో సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటించగా, ఆది పినిశెట్టి ప్రతినాయకుడి పాత్ర పోషించారు. తాజా కోర్టు ఆదేశాలతో ఇవాళ రాత్రి జరగాల్సిన ప్రీమియర్ షోలపై గందరగోళం నెలకొంది. టికెట్ ధరల విషయంలోనూ సందిగ్ధత ఏర్పడటంతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

# ఓటీటీలోకి వచ్చేసిన ‘12ఏ రైల్వే కాలనీ’




విలక్షణ నటనతో ఆకట్టుకుంటున్న నటుడు అల్లరి నరేశ్ నటించిన తాజా చిత్రం ‘12ఏ రైల్వే కాలనీ’. నవంబర్ 21న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తూ హఠాత్తుగా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ఈ చిత్రం ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాలకే డిజిటల్ ప్రీమియర్ కావడం గమనార్హం. నాని కాసరగడ్డ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అల్లరి నరేశ్‌కు జోడీగా కామాక్షి భాస్కర్ల నటించారు. సీనియర్ నటుడు సాయికుమార్, గెటప్ శ్రీను, వైవా హర్ష తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో అల్లరి నరేశ్ మరోసారి తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఇక కథ విషయానికొస్తే.. వరంగల్ రైల్వే కాలనీలో నివసించే అనాథ కార్తీక్ (అల్లరి నరేశ్), స్థానిక రాజకీయ నాయకుడికి నమ్మినబంటుగా ఉంటాడు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో ఆరాధన (కామాక్షి భాస్కర్ల)ను చూసి ప్రేమలో పడతాడు. అయితే ఆరాధన ఎవరు? ఆమె గతం ఏమిటి? ఆమె తన భార్య అంటూ కథలోకి ప్రవేశించిన జయదేవ్ షిండే ఎవరు? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమా సాగుతుంది.

# తెలుగు తెరపై విరిసే మరో మలయాళ బ్యూటీ!





తెలుగు తెర ఎప్పటికప్పుడు కొత్త కథానాయికలను పరిచయం చేయడానికి ఉత్సాహాన్ని కనబరుస్తూ ఉంటుంది. కొత్త బ్యూటీలను ఆదరించడానికి ఇక్కడి ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. ఒకప్పుడు ఇక్కడి సిల్వర్ స్క్రీన్ పై ముంబై భామల హవా కొనసాగినప్పటికీ, ఆ తరువాత కాలంలో మలయాళ భామలు తమ జోరును కొనసాగిస్తూ వచ్చారు. ఇప్పటికీ ఇక్కడ వారి దూకుడే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే మరో అమ్మాయి మలయాళం నుంచి దిగిపోయింది. ఆ బ్యూటీ పేరే అనశ్వర రాజన్. అనశ్వర రాజన్ .. మలయాళంలో .. అక్కడి యూత్ లో ఇప్పుడు విపరీతమైన క్రేజ్ ఉన్న హీరోయిన్. అనశ్వరలో ఏదో తెలియని ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉంటుంది. అందుకు సహజమైన ఆమె అభినయం కూడా తోడవడం .. సక్సెస్ లు వచ్చిపడటంతో బిజీగా మారిపోయింది. మలయాళంలో వచ్చిన ‘నెరు’ .. ‘రేఖాచిత్రం’ వంటి చిత్రాలు ఆమె నటనకి అద్దం పడతాయి. మోహన్ లాల్ వంటి గొప్ప నటుడితో ప్రశంసలు అందుకోవడం అనశ్వర ప్రతిభకు నిదర్శనం అనే చెప్పాలి. మలయాళంలో ఇప్పుడు అనశ్వరకి విపరీతమైన క్రేజ్ ఉంది. అక్కడి సినిమాలను లైన్లో పెడుతూనే, ఆమె తెలుగు .. తమిళ .. హిందీ సినిమాలు చేయడానికి ఆసక్తిని కనబరుస్తూ ఉండటం విశేషం. తెలుగులో ఆమె చేసిన ‘ఛాంపియన్’ సినిమా ఈ నెల 25వ తేదీన థియేటర్లకు రానుంది. శ్రీకాంత్ తనయుడు రోషన్ జోడీగా ఆమె పరిచయమవుతూ ఉండటం విశేషం. ఈ సినిమా హిట్ అయితే అనశ్వర ఇక్కడ మరిన్ని సినిమాలు చేసే ఛాన్స్ ఉంది. ఓటీటీ సినిమాల ద్వారా అనశ్వర అభిమానులుగా మారిపోయిన ఇక్కడి కుర్రాళ్లంతా ఈ సినిమా కోసమే వెయిట్ చేస్తున్నారు.

# సూర్య సినిమా సమ్మర్ కి షిఫ్ట్..

కోలీవుడ్ స్టార్ సూర్య ఆర్ జె.బాలాజీ కాంబినేషన్ లో వస్తున్న సినిమా కరుప్పు. త్రిష హీరోయిన్ గా నటించిన ఈ సినిమా అసలైతే లాస్ట్ దసరాకే రిలీజ్ అనుకున్నారు కానీ సినిమాను రిలీజ్ చేయలేదు. అక్టోబర్ మిస్సైనా నవంబర్, డిసెంబర్ లో రిలీజ్ ఉంటుందని అనుకోగా తమ్ముడి సినిమా వా వాతియార్ ఉందని సూర్య తన సినిమా రిలీజ్ చేయలేదు. చూస్తుంటే సినిమా నెక్స్ట్ ఇయర్ సమ్మర్ కి వాయిదా పడినట్టే అని తెలుస్తుంది. కరుప్పు సినిమాలో సూర్య చాలా రోజుల తర్వాత ఒక మాస్ రోల్ చేశారు. %సూశ్రీంశీ =ఘుం% - ‘పెద్ది’ డేట్ మిస్సయితే.. ప్లాన్ ఏంటీ? మాస్ యాంగిల్ లో సూర్యని చూడాలని.. ఆర్జే బాలాజీ తన డైరెక్షన్ లో చేస్తున్న మాస్ అటెంప్ట్ గా కరుప్పు వస్తుంది. సూర్యని మాస్ యాంగిల్ లో చూడాలని అనుకునే ఫ్యాన్స్ అందరికీ ఈ సినిమా నచ్చేస్తుందని అంటున్నారు. ఐతే సినిమాపై మంచి బజ్ ఉన్నా కూడా రిలీజ్ విషయంలో ఏర్పడుతున్న ఈ కన్ ఫ్యూజన్ సినిమా మీద ఏర్పడ్డ బజ్ తగ్గిస్తుంది. రిలీజ్ ఎప్పుడన్నది క్లారిటీ లేకుండా ఉండటం వల్ల ఫ్యాన్స్ లో ఆసక్తి తగ్గుతుంది. కరుప్పు సినిమా సూర్య నుంచి రాబోతున్న క్రేజీ మాస్ సినిమా అని తెలుస్తుంది. ఈ సినిమాలో సూర్య తన వింటేజ్ స్టైల్ లుక్ అండ్ యాక్టింగ్ తో అదరగొట్టేస్తారని అంటున్నారు. ఈమధ్య స్టార్స్ ని తమ వింటేజ్ లుక్ తో చూపించి ఫ్యాన్స్ కి ఫీస్ట్ అందిస్తున్నారు. సో ఇప్పుడు అదే తరహాలో సూర్య కూడా కరుప్పుతో తన ఫ్యాన్స్ ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు. యూత్ లో విపరీతమైన క్రేజ్ ఉన్న మమితా.. ఈ సినిమా తర్వాత తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరితో సినిమా చేస్తున్నాడు సూర్య. ఆ సినిమా కూడా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. సూర్య వెంకీ అట్లూరి కాంబినేషన్ సినిమాలో మమితా బైజు హీరోయిన్ గా నటిస్తుంది. యూత్ లో విపరీతమైన క్రేజ్ ఉన్న మమితా ఈసారి తెలుగు స్ట్రైట్ సినిమాతో ఆకట్టుకునేలా ఉంది. సూర్య కరుప్పు సమ్మర్ కి వాయిదా పడితే వెంకీ అట్లూరి సినిమా నెక్స్ట్ ఇయర్ సెకండ్ హాఫ్ లో వస్తుంది. సార్, లక్కీ భాస్కర్ తో సూపర్ హిట్ అందుకున్న వెంకీ ఈసారి సూర్యతో ఎలాంటి సినిమాతో వస్తాడా అన్న ఎగ్జైట్ మెంట్ ఆడియన్స్ లో ఉంది.కరుప్పు సినిమా ప్రమోషనల్ కంటెంట్ బాగానే ఉన్నా కూడా థియేట్రికల్ రన్ బిజినెస్ విషయంలో ఇంకా క్లారిటీ రాలేదని తెలుస్తుంది. సినిమాపై మాత్రం మేకర్స్ చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నారు. ఆర్జే బాలీజి డైరెక్టర్ గా ఒక స్టార్ తో చేసిన కరుప్పు డైరెక్టర్ గా అతని గ్రాఫ్ పెంచేలా చేస్తుందని నమ్ముతున్నారు. కరుప్పు, వెంకీ అట్లూరి డైరెక్షన్ సినిమా ఈ రెండు సినిమాలతో సూర్య నెక్స్ట్ ఇయర్ ఫ్యాన్స్ ని ఎంటర్టైన్ చేయనున్నాడు.



# నాలుగు పతకాలతో గట్టి సమాధానం





టాలీవుడ్‌లో తల్లి, అత్త, అక్క, వదిన వంటి అనేక పాత్రల్లో నటించి ప్రేక్షకులను అలరించిన ప్రముఖ నటి ప్రగతి మరోసారి తన ప్రతిభతో, పట్టుదలతో అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. కరోనా తర్వాత సోషల్ మీడియాలో యాక్టివ్‌గా మారిన ప్రగతి, రీల్స్ ద్వారా, స్టెప్పులతో, పబ్లిక్ అప్పియరెన్స్‌లతో పెద్ద ఎత్తున పాపులారిటీ దక్కించుకుంటుంది. అయితే సోషల్ మీడియా సంచలనంగా మారిన ఈ నటి, తన వ్యక్తిగత జీవితంలో మాత్రం అసలు సిసలైన్గ ÷టైర్‌గా నిలుస్తోంది.కరోనా సమయంలో జిమ్ వర్కౌట్స్‌తో మొదలైన ప్రయాణం, నేడు ఆసియా లెవెల్ పతకాల వరకూ తీసుకెళ్తుందని ఎవరూ ఊహించలేదు. పవర్ లిఫ్టింగ్‌పై ఘనమైన పట్టు సాధించిన ప్రగతి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వరుసగా పతకాలు గెలుచుకుంటూ 50 ఏళ్ల వయసులో కూడా యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. తాజాగా టర్కీలో జరిగిన అవార్డు ఫంక్షన్‌లో పాల్గొన్న ఆమె, నాలుగు పతకాలు సాధించి అందరు తలెత్తుకునేలా చేసింది. ఈ అద్భుత గెలుపుతో సోషల్ మీడియాలో ప్రగతి పేరు మారుమోగుతుండగా, సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు అందరూ వరుసగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. గతంలో ప్రగతి జిమ్‌లో పెట్టిన ఫోటోలపై కొందరు నెటిజన్లు నెగటివ్ కామెంట్లు చేసిన సంగతి తెలిసిందే. జిమ్ డ్రెస్సింగ్‌పై, వయసుపై, వర్కౌట్‌పై వదిలిన టాక్సిక్ కామెంట్లకు ఆ సమయంలో ప్రగతి మౌనంగా ఉన్నప్పటికీ, తాజాగా త్రీ రోజెస్ సీజన్ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆమె, ట్రోలర్స్‌కు ఘాటు సమాధానం ఇచ్చింది. కానీ ట్రోలర్స్‌కి నేను సాధించిన ఈ పతకాలే అసలైన సమాధానం.‘అంతేకాక, తన విజయాన్ని ఇండస్ట్రీకి చెందిన అందరు మహిళలకు అంకితం చేస్తున్నాను అని తెలిపింది. ఆమె మాటలు ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# దురంధర్‌పై హృత్రిక్ ప్రశంసలు



ఇటీవల విడుదలైన ధురంధర్ ప్రశంసలు అందుకుంటుంది. ఇప్పటికే పలువురు ప్రముఖులు ఈ చిత్రంపై రివ్యూ ఇవ్వగా తాజాగా హృతిక్ రోషన్ దీని గురించి మాట్లాడారు. అయితే, ఆయన వ్యాఖ్యలను కొందరు నెటిజన్లు తప్పుపడుతున్నారు. సినిమా చాలా బాగుందన్న హృతిక్ ఇందులో చూపించిన రాజకీయ అంశాలను తాను అంగీకరించనని అన్నారు. నాకు ఈ చిత్రం చాలా నచ్చింది. ఇంత గొప్ప కథను ప్రేక్షకులకు అందించినందుకు చిత్ర బృందానికి అభినందనలు. హృదయానికి హత్తుకునేలా దీన్ని తీర్చిదిద్దారు. కథను తెరకెక్కించిన విధానం మెప్పించింది. సినిమా అంటే ఇలా ఉండాలి అనిపించింది. ఇందులో చూపించిన రాజకీయపరమైన అంశాలను నేను అంగీకరించలేకపోతున్నా. కానీ, దర్శకులు కొన్ని విషయాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి కాబట్టి అలా రూపొందించారని నేను భావిస్తున్నా. నేను ఈ చిత్రాన్ని ఆస్వాదించాను. దీనినుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను‘ అని హృతిక్ అన్నారు. ఇప్పుడీ కామెంట్స్ విమర్శలకు దారితీస్తున్నాయి. ధురంధర్‌లో కేవలం పాకిస్థాన్ ఉగ్రవాదుల క్రూరత్వాన్ని చూపారని, వారి భయంకరమైన దాడులను చూపారని ఆ విషయాలను ఎందుకు అంగీకరించలేక పోతున్నారని నటుడిపై విమర్శలు కురిపిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్, మాధవన్, సంజయ్‌దత్, అక్షయ్ ఖన్నా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా మరోవైపు కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. డిసెంబర్ 5న విడుదలైన ఈ యాక్షన్ థ్రిల్లర్ ఇప్పటివరకూ రూ.180 కోట్లు వసూలు చేసింది. ఈ వారంలో రూ.200 కోట్లు వసూలు చేయవచ్చని అభిమానులు భావిస్తున్నారు.